VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 22.07.2026
సంపుటి : 09 సంచిక : 43 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

## సోషల్ మీడియాకు లక్ష్మణరేఖ తప్పనిసరి

- తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియా కట్టడికి చర్యలు
- యూట్యూబ్ ముసుగులో సనాతన ధర్మంపై అర్బన్ నక్సల్స్ దాడి ఆందోళన కలిగిస్తోంది

# కొడంగల్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి




- ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనుల్లోనూ వేగం పెరగాలి
- ఆగస్టు 30 న మళ్లీ వస్తా...
- పురోగతిపై సమీక్ష చేసి ఇక్కడే బస చేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొడంగల్ వెలుతురు జూలై 21:**
కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ ను సీఎం పరిశీలించారు. అనంతరం అక్కడే కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం ఆరా తీశారు. ప్రాజెక్టు భూ సేకరణ విషయంలో జాప్యం జరగొద్దని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు భూసేకరణకు అవసరమైన సర్వేయర్లతో పాటు బడ్జెట్ మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలనారు. భూసేకరణ పూర్తి చేసి టెండర్ ప్రాసెస్ మొదలు పెట్టాలని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సీఎం పలు కీలక సూచనలు చేశారు. గ్రామాల్లో రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనలో పురోగతిపై అధికారులకు ఆదేశాలిచ్చారు.




నియోజకవర్గంలో ఏ తండాలో రోడ్డు లేదన్న మాట వినిపించొద్దని, ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండేలా చూడాలన్నారు. కొత్త గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామపంచాయతీ భవనాలను నిర్మించాలని తెలిపారు. ఈఈ స్థాయి అధికారిని నియమించి నిరంతరం పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఎల్నినో నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

▶ మిగతా 11లో

## కరువు వేళ రాజకీయాలు మానుకోవాలి... రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం




2

- దేవాదుల ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం
- దేవాదులపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- పదేళ్లు నిర్లక్ష్యం చేసిన వారికే ఇప్పుడు మాట్లాడే హక్కు లేదు
- వరంగల్ వేదికగా చర్చించిన అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు

- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు
- ఖర్గేకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్ష
- ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాష



2

## నగర సమగ్ర అభివృద్దే లక్ష్యం: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు వెలుతురు జూలై 21:**
నిజామాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

నగర సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహేష్ కుమార్ గౌడ్ గారు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి గారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.




2

## నీట్ లీక్ ఘోర పాపం

- మళ్లీ జరగొద్దు: ప్రధాని మోదీ
- నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని తొలి స్పందన
- బాధ్యులకు కఠిన శిక్షలు తప్పవన్న మోదీ
- లీకేజీల నివారణ జాతీయ బాధ్యతగా వ్యాఖ్య
- యువతను తప్పుదారి పట్టించొద్దని ఎంపీలకు సూచన
- పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలని పిలుపు



2

## ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

2

- పోటెత్తిన భక్తజనం.. భక్తుల సందడితో మార్మోగిన ఆలయం
- సీఎం సతీమణి గీతతో పాటు ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు
- తెల్లవారుజాము నుంచే దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- జనసందోహంతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



## విద్యార్థులపై అమానుషంగా దాడులు చేస్తారా?



11

- ఇంత జరుగుతుంటే ప్రధాని మోదీ ఏం చేస్తున్నారు?
- సీజేపీ మార్చ్ ఘటనపై కేంద్రాన్ని నిలదీసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- గాయపడిన విద్యార్థులను పరామర్శించనున్న రాహుల్, ప్రియాంకా

## ప్రజా సమస్యలపై కేంద్రం మౌనం వీడాలి

- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- సీజేపీ కార్యకర్తలపై పోలీసుల చర్యను ఖండించిన కాంగ్రెస్ ఎంపీ
- గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన రాహుల్, ప్రియాంక
- అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్
- ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎందుకు కాపాడుతున్నారని ప్రధాని మోదీని ప్రశ్నించిన చామల



2

## 'ఎల్ నినో'పై సర్కార్ వ్యూహం

- సాగు, తాగునీరు, విద్యుత్ రంగాలపై సమీక్ష
- వేటిపైనా ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- వాతావరణ మార్పులపై ముందస్తు చర్యలు
- రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ అవగాహన సదస్సు
- కార్యక్రమానికి హాజరైన మంత్రి అజారుద్దీన్
- గ్రామీణ స్థాయి వరకు చైతన్య కార్యక్రమాలు




2

## సింధూ జలాల ఒప్పందం యథాతథంగా అమలు కుదరదు

- మార్పులు తప్పనిసరి అని స్పష్టం చేసిన కేంద్రం
- ప్రస్తుత రూపంలో ఒప్పందం పునరుద్ధరణకు అవకాశం లేదన్న సంకేతాలు
- ఉగ్రవాదాన్ని పూర్తిగా విడనాడితేనే తదుపరి నిర్ణయాలు
- దేశ ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రధానమని స్పష్టీకరణ



11

## అమెరికాలో టీటీఏ మెగా కన్వెన్షన్‌కు హాజరైన సీతక్క

- తెలంగాణ ప్రజల ప్రేమను విదేశాల్లోనూ చాటిన ప్రవాస భారతీయులు
- టీటీఏ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాలిపెద్ది కుటుంబానికి కృతజ్ఞతలు



11

## ఢిల్లీ మార్చ్‌తో శంభు సరిహద్దులో ఉద్రిక్తత

- రైతులను అడ్డుకున్న పోలీసులు
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా 'దేశ్ బచావో మోర్చా' పిలుపు
- కిసాన్ ఘాట్ మహా పంచాయత్‌కు వేలాదిగా తరలి వస్తున్న రైతులు
- శంభు బార్డర్‌లో భారీ బందోబస్తు.. బారికేడ్లు, ఇనుప కంచెల ఏర్పాటు



11

## సోనమ్ వాంగ్‌చుక్‌కు హైకోర్టులో ఊరట

- మెదాంతా ఆస్పత్రికి తరలించేందుకు గ్రీన్ సిగ్నల్
- భార్య గీతాంజలి అప్పీల్‌పై సంచలన తీర్పు
- కేంద్రం అభ్యంతరం లేదనడంతో ఊరట
- సఫ్దర్‌జంగ్ నుంచి మెదాంతాకు తరలింపున
- ఎయిమ్స్ వైద్య బృందం, వ్యక్తిగత వైద్యుడితో చర్చలు




11

# ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన సేవలు ప్రశంసనీయం
- ప్రజా సమస్యల పరిష్కారంలో ఖర్గే పాత్ర అభినందనీయం

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 21:**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు హార్కర వేణుగోపాల్ రావు. ఈ సందర్భంగా ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఖర్గే చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

**హైదరాబాద్, వెలుతురు జూలై 20:**



హైదరాబాద్‌లోని బల్కంపేట ఃఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో సందడిగా మారింది.కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి సతీమణి గీత పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయ బద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు బల్కంపేట ప్రధాన రహదారులు, పరిసర వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను కల్పించగా, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# నీట్ లీక్ ఘోర పాపం...

**(మొదటి పేజీ తరువాయి)**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ అనేది ఘోర పాపమని, ఇలాంటి ఘటనలు దేశ భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం నిర్వహించిన 'మంగళ్ మిలన్' ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పరీక్షల లీకేజీలను అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది దేశం మొత్తానికి సంబంధించిన జాతీయ బాధ్యత అని మోదీ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాలపైనా ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విభేదాలు ఉండటం సహజమేనని, అయితే దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం వంటి అంశాల్లో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరిగేలా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.యువతను ఉద్దేశించి కూడా ప్రధాని కీలక సందేశం ఇచ్చారు. పిల్లలను, విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయొద్దని, తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమే అయినా తిరిగి సరైన దారిలోకి రావడం చాలా కష్టమని చెప్పారు. వారు సరైన దిశలో ముందుకు సాగేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.దేశంలోని అత్యంత కీలక పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ పరీక్ష నిర్వహణపై ఈ ఏడాది తీవ్ర వివాదం నెలకొంది. మేలో నిర్వహించిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అనంతరం జూన్‌లో కొన్ని కేంద్రాల్లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఇదే సమయంలో సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలో లోపాలు వెలుగుచూడటంతో విద్యా వ్యవస్థపై మరింత విమర్శలు వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేలాది మంది నిరసనకారులు పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ తొలిసారిగా నీట్ పేపర్ లీక్‌పై బహిరంగంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రజా సమస్యలపై కేంద్రం మౌనం...

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**



పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తుతున్న ప్రజా సమస్యలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజేపీ మద్దతుదారులు, కార్యకర్తలను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో కలిసి పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.సీజేపీ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పలువురు కార్యకర్తలు గాయపడినట్లు చామల తెలిపారు. గాయపడిన వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామని చెప్పారు. విద్యార్థులు, యువతపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సమస్యల విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రజలు మూడోసారి ప్రధాని మోదీకి అధికారాన్ని అప్పగించినప్పటికీ, వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని చామల విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలపై సమాధానం ఇవ్వకుండా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు.రైతులు హర్యానాలో ఆందోళనలు నిర్వహిస్తుంటే వారిని అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించిన చామల, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కును ప్రభుత్వం గౌరవించాలని కోరారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సోషల్ మీడియాకు లక్ష్మణరేఖ తప్పనిసరి

- అట్లాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే
- వ్యక్తిగత, విషపూరిత ప్రచారం పై ఉక్కుపాదం మోపుదాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- కేంద్ర మంత్రిని కలిసిన జనసేన ఎంపీ లింగమనేని రమేశ్
- పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై బండి సంజయ్ ఆరా

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 21:**

తెలుగు రాష్ట్రాల్లో సనాతన ధర్మంపై సోషల్ మీడియా ద్వారా దాడికి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. దీంతోపాటు టార్గెట్ చేసిన వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు విషపూరిత ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా సోషల్ మీడియాకు లక్ష్మణ రేఖ తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ లో కట్టుతప్పుతున్న సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు, జర్నలిజం ముసుగులో యూట్యూబ్ ఛానళ్ల ద్వారా విష ప్రచారం నిర్వహిస్తున్న వారిపై ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని, దీనివల్ల సమాజానికి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జనసేన తరపున ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన లింగమనేని కొద్దిసేపటి క్రితం న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి నివాసంలో బండి సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లింగమనేని రమేశ్ ను కేంద్ర మంత్రి శాలువాతో సన్మానించారు. ఇటీవల ముంబైల్ శస్త్ర చికిత్స చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్న జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియా వ్యవహరిస్తున్న తీరు, జర్నలిజం ముసుగులో కొందరు వ్యక్తులను టార్గెట్ చేస్తూ విష ప్రచారం చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వ్యవహారం ఇద్దరి మధ్య చర్చకు వచ్చింది. అదే సమయంలో అర్బన్ నక్సల్స్ ముసుగులో కొందరు సనాతన ధర్మంపై దాడి చేస్తూ హైందవ సంస్కృతిని కించపరుస్తున్నారని, ఇలాంటి వారిపై మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కోవడం చేతగానివాళ్లు, జర్నలిజం, మేధావుల ముసుగులో కొందరు అర్బన్ నక్సల్స్ సనాతన ధర్మాన్ని కించపరుస్తూ భారతీయ సంస్కృతిపై దాడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తే హైందవ సమాజానికి తీరని నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత దూషణలు, బూతులతో శ్రుతి మించుతున్న సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో త్వరలోనే ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతో చర్చించి కార్యాచరణ రూపొందించేందుకు యత్నిస్తున్నామని చెప్పారు.

# కరువు వేళ రాజకీయాలు మానుకోవాలి... రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

**వరంగల్ / హైదరాబాద్ వెలుతురు జూలై 21:-**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఏ విధంగా ఆదుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.మంగళవారం వరంగల్ జిల్లా సమీక్ష సమావేశం అనంతరం ఆయన సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేసే ముందు పదేళ్లపాటు అధికారంలో ఉన్న మీరు ఏం చేశారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "నోరు తెరిస్తే అబద్ధాలే... అబద్ధాల పునాదుల మీదనే బీఆర్ఎస్ రాజకీయాలు కొనసాగుతున్నాయి" అని మండిపడ్డారు.మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇది రాజకీయాలు చేసే సమయం కాదని, కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో శవాల మీద పేలాలు ఏరుకునే రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. గుడ్డ కాల్చి ప్రభుత్వంపై వేయాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఐదేళ్లు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి కనీస అవగాహన లేకుండా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఏపీకి నీళ్లు ఇవ్వడానికే ఇక్కడ ఎత్తిపోతల ఆపేశారని చెప్పడం పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు.రాష్ట్రంలో నెలకొన్న




వర్షాభావ పరిస్థితులపై ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దాదాపు రెండు గంటల పాటు సమగ్రంగా చర్చించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ, అందుబాటులో ఉన్న తాగునీరు, సాగునీటిని సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలనే దానిపై కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కరువు ప్రభావం రైతులపై వీలైనంత తక్కువగా పడేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వరంగల్ వేదికగా 5 గంటలకు పైగా చర్చించిన అంశాలపై మరో సారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో క్యాబినెట్‌లో చర్చించి రాష్ట్ర మంతటా అమలు చేస్తామన్నారు. లెమన్ గ్రాస్, ఉపాధి హామీ పథకం ద్వారా కార్మికులకు ఉపాధి చర్యలు వంటి అంశాలపై చర్చిస్తామన్నారు. గోదావరి ద్వారా 16632 క్యూసెక్కుల నీరు పోతోందని , మీ హయాంలో మోటార్లు వేస్తే ఎందుకు నష్టం జరిగిందో చెప్పాలన్నారు. ఇలాంటి సమయంలో ప్రధాన ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్మాణాత్మక సూచనలు చేయాల్సింది పోయి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. హరీష్‌రావు చెప్పారని మోటార్లు ఆన్ చేయడం, సాగునీరు ఇవ్వడం చేశామన్న వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. తాము రైతులు, ప్రజలు, నిరుద్యోగుల కోసం నిరంతరం పనిచేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తూ, ఉమ్మడి వరంగల్ జిల్లా జీవనాడి అయిన ఈ ప్రాజెక్టును దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మూడు దశల్లో ప్రారంభించారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేయాలనే ఆలోచన కూడా చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేయడమే లక్ష్యంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇటీవల తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి ప్రాజెక్టును సందర్శించి, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్ట్ విషయంలో అసెంబ్లీలో పూర్తి స్థాయి చర్చకు సిద్దంగా ఉన్నామని దీనికి మీరు సిద్దమేనా అని మంత్రి ప్రశ్నించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రాజకీయ ఆరోపణలకు కాకుండా సమస్యల పరిష్కారానికే తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు

# నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యం...

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఐపీఎస్ శుభమ్ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ దిలీప్, డీఆర్వో గీత, ట్రాఫిక్ ఏసీపీ మహమ్మద్ అలీ, మేయర్ ఉమారాణి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు, తాహేర్ బిన్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శివార్లలో మరో రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనపై సవివరంగా చర్చించారు. అలాగే నగర అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండే మాస్టర్ ప్లాన్ అమలుపై అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను సమీక్షించారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా నాలుగు నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగరంలోని దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రాజీవ్ చౌక్, పులాంగ్ చౌరస్తా, ఎల్ఐసీ చౌరస్తా, పాత కలెక్టర్ గ్రౌండ్ చౌరస్తా ప్రాంతాల్లో రహదారుల వెడల్పు పెంపుతో పాటు జంక్షన్లను విస్తరించే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, నగర ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం



చేయాలని సూచించారు.నిజామాబాద్ నగరాన్ని సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# 'ఎల్ నినో'పై సర్కార్ వ్యూహం

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న 'ఎల్ నినో' వంటి ప్రతికూల మార్పుల వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రజలు, వివిధ రంగాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో ముందస్తు వ్యూహాలు రూపొందిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ వాతావరణ ప్రభావం పడకుండా పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. సమస్య తీవ్రతను ముందే గ్రహించి ఎదుర్కొనేలా రాష్ట్ర యంత్రాంగాన్ని, సన్నద్ధం చేస్తున్నారు.హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో "పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు" అనే అంశంపై ఒక ప్రత్యేక రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేవలం పాలనాపరమైన ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా, ఎల్ నినో ప్రభావంపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన పెంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు.వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తెలంగాణలోని చెరువులు, వాగులు, గ్రామీణ ప్రాంతాల నీటి వనరులపై ఎలాంటి ప్రభావం పడుతుందో శాస్త్రవేత్తల ద్వారా ప్రభుత్వం అధ్యయనం చేయిస్తోంది. దీని




ఆధారంగా వ్యక్తిగత, కుటుంబ, గ్రామ, మండల మరియు జిల్లా స్థాయిలో ఎవరికి వారు ముందస్తుగా సిద్ధమయ్యేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ చైతన్యం తెస్తున్నట్లు తెలిపారు.ఒకవేళ వాతావరణ మార్పుల వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ నిపుణుల సూచనల ప్రకారం తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ సమాచారాన్ని నిరంతరం ప్రత్యక్ష ప్రసారాలు, మీడియా ద్వారా ప్రచారం చేస్తూ రైతాంగాన్ని సిద్ధం చేస్తున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో జీవన విధానానికి విద్యుత్ అత్యంత కీలకంగా మారిందని, ఎల్ నినో వల్ల పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా తట్టుకునేందుకు 'స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్' అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. పగటి పూట సమృద్ధిగా, తక్కువ ఖర్చుతో లభించే సౌర విద్యుత్‌ను (సోలార్ పవర్) గరిష్టంగా వాడుకోవడం వల్ల ప్రభుత్వం మరియు వినియోగదారులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పగటి పూట సోలార్ వాడి, మిగిలిన సమయాల్లో థర్మల్ విద్యుత్‌ను సమతుల్యంగా వాడుతూ విద్యుత్ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నట్లు చెప్పారు.వాతావరణంలో మార్పులు మరియు ఉష్ణోగ్రతలు పెరగడంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఫ్యాన్లు, ఏసీలు, బోర్లకు ఉపయోగించే మోటార్లు మరియు లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ వాడకం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం గుర్తించింది. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది. కానీ, ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం తెలంగాణలో నమోదవుతున్న డిమాండ్ వేసవి కాలం (ఏప్రిల్) నాటి గరిష్ట స్థాయికి చేరింది. ఈ రకమైన ఊహించని డిమాండ్‌ను తట్టుకునేలా ముందస్తుగా సమర్థవంతమైన ఎనర్జీ ప్లానింగ్ పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు.ప్రభుత్వం కేవలం ప్రజల తాగునీరు, వ్యవసాయ సాగునీటి అవసరాలకే పరిమితం కాకుండా సమగ్ర ఆలోచనతో అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పశువులు, పక్షులతో పాటు అడవుల్లో ఉండే జంతువుల నీటి, ఆహార అవసరాలకు కూడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అన్ని జీవరాశుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ప్రణాళికా బోర్డు ఈ వివరాలను సిద్ధం చేసింది.సమాజంలో వాతావరణ మార్పులపై చైతన్యం తీసుకురావడానికి విషయ నిపుణులతో ఈ సమావేశాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసిన ప్లానింగ్ శాఖను డిప్యూటీ సీఎం అభినందించారు. వ్యవసాయ, విద్యుత్, సాగునీటి, భూగర్భ జల శాఖలను సమన్వయం చేసి పనిచేయడాన్ని కొనియాడారు. భవిష్యత్తులో ఇటువంటి అవగాహన సదస్సులను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి పాటిల్, ప్లానింగ్ డైరెక్టర్ రూఫొస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీక్‌లకు మోదీ ప్రభుత్వమే బాధ్యత

- ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- విద్యార్థులపై లాఠీచార్జీ అమానుషం – దేశ యువతకు ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్

హైదరాబాద్ వెలుతురు జూలై 21:

2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసం తీవ్రంగా దెబ్బతిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ తీవ్రంగా విమర్శించారు.

దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలు, నియామక పరీక్షలు వరుసగా పేపర్ లీక్‌ల బారిన పడడం, పరీక్షలు రద్దు కావడం, లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడటం మోదీ ప్రభుత్వ ఘోర పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.NEET, UGC–NET, CUET, JEE, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు, పోలీస్, టీచర్, కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రూప్ ఉద్యోగాల పరీక్షలు సహా అనేక పరీక్షల్లో జరిగిన అవకతవకలు దేశ విద్యా వ్యవస్థను అపహాస్యం చేశాయని పేర్కొన్నారు.బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కూడా పలు నియామక పరీక్షల పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దులు, నియామక కుంభకోణాలు వెలుగు చూసినా, కేంద్ర ప్రభుత్వం మాఫియాలపై ఉక్కుపాదం మోపకుండా విద్యార్థులనే ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.నీట్ పేపర్ లీక్ దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. ఎన్నో సంవత్సరాల కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమను కొందరు మాఫియాలు, వారి వెనుక ఉన్న శక్తులు డబ్బు కోసం అమ్ముకోవడం అత్యంత దారుణమన్నారు.ఈ ఘోర వైఫల్యానికి పూర్తి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యతతో వెంటనే రాజీనామా చేయాలని, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి కూడా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్షల్లో న్యాయం కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువజన సంఘాలపై లాఠీచార్జీలు చేయించడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రాలను కాపాడలేని ప్రభుత్వం, ప్రశ్నించే విద్యార్థులను మాత్రం లాఠీలతో అణచివేయడం సిగ్గుచేటని విమర్శించారు.విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి ప్రధాని నరేంద్ర మోదీ దేశ యువతకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, పేపర్ లీక్ మాఫియాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.దేశ యువత భవిష్యత్తు, వారి కలలు, వారి శ్రమ రాజకీయాల కంటే గొప్పవని, పరీక్షా వ్యవస్థను పూర్తిగా సంస్కరించి పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం కలిగిన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పి. ప్రసన్నకుమార్ శర్మ కోరారు.

**డిమాండ్లు:**

- ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలి.
- కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి.
- NEET పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలి.
- విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పాలి.
- పేపర్ లీక్ మాఫియాలకు కఠిన శిక్షలు విధించే ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలి.
- పరీక్షా వ్యవస్థను పూర్తిగా సంస్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

**2014–2026: మోదీ హయాంలో పేపర్ లీకులు – పరీక్షా వ్యవస్థ వైఫల్యాలు**

**జాతీయ స్థాయిలో జరిగిన ప్రధాన పరీక్షల వివాదాలు**

**2015 – వ్యాపం (Vyapam) కుంభకోణం – మధ్యప్రదేశ్**

మెడికల్ ప్రవేశాలు
ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు
భారీ స్థాయిలో అక్రమాలు
వందలాది అరెస్టులు
కేసు CBIకి బదిలీ

**2021 – UGC-NET పరీక్ష**

పరీక్ష నిర్వహణపై అనుమానాలు
భద్రతా లోపాలపై విమర్శలు

**2022–23 – వివిధ కేంద్ర నియామక పరీక్షలు**

SSC
RRB
ఇతర నియామక పరీక్షలపై నిరసనలు
ప్రశ్నాపత్ర భద్రతపై విమర్శలు

**2024 – NEET-UG**

ప్రశ్నాపత్ర లీక్ ఆరోపణలు
బీహార్ సహా పలు రాష్ట్రాల్లో అరెస్టులు
CBI దర్యాప్తు
సుప్రీంకోర్టులో విచారణ
దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు

**2024 – UGC-NET**

పరీక్ష నిర్వహించిన కొద్ది గంటల్లోనే రద్దు
సమగ్ర దర్యాప్తు
విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన

**2024 – CSIR-UGC NET**

**పరీక్ష వాయిదా**

**రాష్ట్రాల వారీగా ప్రధాన పేపర్ లీకులు**

**ఉత్తరప్రదేశ్**

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష
టీచర్ నియామక పరీక్షలు
TET
పలు పరీక్షలు రద్దు

**బీహార్**

BPSC
కానిస్టేబుల్ నియామకాలు
NEET పేపర్ లీక్ కేసు
అరెస్టులు

**మధ్యప్రదేశ్**

వ్యాపం
పోలీస్ నియామకాలు
ఉపాధ్యాయ నియామకాలు

**రాజస్థాన్**

REET
SI Recruitment
ఉపాధ్యాయ నియామకాలు
పలు అరెస్టులు

**గుజరాత్**

జూనియర్ క్లర్క్
హెడ్ క్లర్క్
పోలీస్ నియామక పరీక్షలు

**ఉత్తరాఖండ్**

UKSSSC
ఫారెస్ట్ గార్డ్
పట్వారీ
పలు నియామక పరీక్షలు

**హర్యానా**

HSSC
పోలీస్
క్లర్క్ నియామకాలు

**మహారాష్ట్ర**

టీచర్ అర్హత పరీక్షలు
పోలీస్
నియామక పరీక్షల వివాదాలు

**జమ్మూ & కాశ్మీర్**

JKSSB
SI Recruitment

**ప్రభావం**

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింది.
పరీక్షల రద్దుతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది.
కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడింది.
విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరిగింది.
ప్రభుత్వ నియామక వ్యవస్థపై నమ్మకం తగ్గింది.

**కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు**

1. పరీక్షా భద్రతపై జాతీయ విధానం రూపొందించాలి.
2. Paper Leak Prevention Authority ఏర్పాటు చేయాలి.
3. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి.
4. CBI లేదా స్వతంత్ర సంస్థలతో దర్యాప్తు జరపాలి.
5. పేపర్ లీక్ మాఫియాల ఆస్తులను జప్తు చేయాలి.
6. పరీక్ష రద్దయితే అభ్యర్థులకు పరిహారం ఇవ్వాలి.
7. డిజిటల్ భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలి.
8. పరీక్షా సంస్థలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలి

**ప్రధాన ప్రశ్నలు**

- 2014 తర్వాత ఎందుకు వరుసగా పేపర్ లీకులు జరుగుతున్నాయి?
- ప్రశ్నాపత్రాలను రక్షించలేని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును ఎలా కాపాడుతుంది?
- ప్రతి లీక్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు?
- లీక్ మాఫియాలపై ఎందుకు వేగవంతమైన చర్యలు కనిపించడం లేదు?
- పరీక్షల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న శాశ్వత చర్యలు ఏమిటి?

**ముగింపు**

పేపర్ లీక్ అనేది కేవలం ఒక పరీక్ష రద్దు కావడం కాదు. అది ఒక విద్యార్థి కలను, ఒక కుటుంబం ఆశను, దేశ యువత నమ్మకాన్ని దెబ్బతీసే వ్యవస్థాపరమైన వైఫల్యం. పరీక్షల పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం పునరుద్ధరించడానికి సమగ్ర సంస్కరణలు అత్యవసరం.



పి. ప్రసన్నకుమార్ శర్మ
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)

# రాహుల్ గాంధీ, ప్రతిపక్ష ఎంపీల అరెస్టులను ఖండిస్తూ నేడే "చలో రాజ్‌భవన్" కార్యక్రమం – రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు

- పి. ప్రసన్నకుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)



హైదరాబాద్ వెలుతురు జూలై 21:

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు పిలుపు మేరకు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ గారిని, అలాగే కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ, లోక్‌సభ పార్లమెంట్ సభ్యులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నేడు (22 జూలై) ఉదయం 11.00 గంటలకు "చలో రాజ్‌భవన్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ తెలిపారు.ఈ కార్యక్రమం నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి నాయకత్వంలో రాజ్‌భవన్ వరకు భారీ నిరసన ర్యాలీగా కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా పి. ప్రసన్నకుమార్ శర్మ మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ హక్కులు, ప్రతిపక్ష స్వరం అణచివేతకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై నిర్బంధ చర్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, యువత భవిష్యత్తును పరిరక్షించే పోరాటంలో శ్రీ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని తెలిపారు.రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కుల కోసం నిర్వహిస్తున్న ఈ "చలో రాజ్‌భవన్" కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రజాస్వామ్యవాది, సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పి. ప్రసన్నకుమార్ శర్మ పిలుపునిచ్చారు.

# ఎక్సైజ్ గజిటెడ్ అధికారుల దాతృత్వం

హైదరాబాద్ వెలుతురు జూలై 21:

తెలంగాణ రాష్ట్ర బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవిన్యూ ఎక్సైజ్ శాఖలో డేట ఎంట్రీ ఆపరేటర్ గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తు అకస్మాత్తుగా గుండె పోటుతో తనువు చాలించిన కి|| శే|| చిర. ఏకాంబరం ఈ నెల 8న మరణించారు. ఆ కుటుంబాన్ని మానవత దృక్పథంతో ఆదుకోవాలనే సంకల్పంతో తెలంగాణ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం, నాన్ గెజిటెడ్ మినిస్టీరియల్ సిబ్బంది మరియు ఎక్జిక్యూటివ్ సంఘాల సభ్యుల వితరణతో వచ్చిన సహాయ నిధి మొత్తం ₹ 3 లక్షల 46 వేల రూపాయలను ఎక్సైజ్ కమిషనర్ శ్రీ హరికిరణ్ ఐఏఎస్ గారి చేతుల మీదుగా కీ.శే. ఏకాంబరం సతీమని శ్రీమతి స్వప్న లతకు ఈరోజు ఆబ్కారి భవన్ లో అందిచడం జరిగింది. మానవీయ కోణంలో ఎక్సైజ్ కమిషనర్ గారు సైతం వ్యక్తిగతంగా ఆర్థిక చేయూతను ఆ కుటుంబానికి అందించారు. ఇందులో ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నుండి ₹ 2 లక్షల 75 వేలు మరియు మినిస్ట్రియల్ సిబ్బంది ₹ 71 వేల ను సహాయ నిధికి జమ చేసినట్లు అధ్యక్ష,కార్యదర్శులు టి. లక్షణ్ గౌడ్ , చంద్రశేఖర్ తెలిపారు.



ఎంతో నిబద్ధత తో ఉద్యోగం చేస్తూ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించిన ప్రైవేట్ ఉద్యోగి కుటుంబానికి భరోసా కల్పించి ఆ కుటుంబానికి చేయూత అందించిన ఎక్సైజ్ శాఖ లోని ఉద్యోగుల సేవానిరతిని ఎక్సైజ్ కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీ యాసిన్ ఖురేషి గారు, సైబరాబాద్ ఉప కమిషనర్ శ్రీ జె. హరి కిషన్ గారు ఎక్సైజ్ అధికారులు కె.విజయ్ కుమార్, బి.ప్రవీణ్ కుమార్, ఎం.రాధ, జయసుధ , సౌజన్య నాన్ గజిటెడ్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, డి.తిరుపతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

**ఉద్యోగ జె.ఏ సి అభినందన**

తోటి ఉద్యోగికి ఆపద వచ్చిన వెంటనే ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల గొప్పతనాన్ని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జె.ఏ. సి నాయకత్వం అధ్యక్షుడు జగదీశ్వర్ , సెక్రటరీ జనరల్ శ్రీ ఏలూరి శ్రీనివాస రావు, టి.జి.ఓ ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్ కొనియాడి ఎక్సైజ్ ఉద్యోగులకు సంఘ నాయకులకు అభినందనలు తెలియజేశారు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కమిషనర్ గారికి కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపించమని కోరారు.

# గుడిమల్కాపురం గ్రామపంచాయతీలో MGNREGS నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులపై సమగ్ర విచారణ చేపట్టి, విచారణ పూర్తయ్యే వరకు బిల్లులు నిలిపివేయాలి

- సర్పంచ్, ఉపసర్పంచ్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వార్డ్ సభ్యుల వినతి

భువనగిరి వెలుతురు జూలై 21:

సంస్థాన్ నారాయణపూర్ గుడిమల్కాపురం గ్రామపంచాయతీకి చెందిన మేము మెజార్టీ వార్డ్ సభ్యులం మంగళవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గారిని కలిసి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో జరుగుతున్న అవకతవకలు, నాణ్యతా లోపాలు మరియు ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై వినతిపత్రం సమర్పించాము.వినతిపత్రంలో గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, రోడ్డు క్యూరింగ్ కోసం ఎలాంటి అధికారిక అనుమతి లేకుండానే గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామపంచాయతీ ట్యాంకర్‌ను వినియోగిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాము.అలాగే గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా స్థాయి సాంకేతిక నిపుణులతో సమగ్ర నాణ్యతా పరిశీలన (Quality Inspection) నిర్వహించి, విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత పనులకు ఎలాంటి బిల్లులు విడుదల చేయకుండా వెంటనే నిలిపివేయాలని కోరాము.అదేవిధంగా, గత ఆరు నెలల కాలంలో గుడిమల్కాపురం గ్రామపంచాయతీకి ఆరుగురు కార్యదర్శులు మారిన అంశంపై సమగ్ర విచారణ జరపాలని కోరాము. రెండు నెలల క్రితమే పూర్తి స్థాయి గ్రామపంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీఓ గారికి వినతిపత్రం అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్ గారికి వివరించాము. ప్రస్తుతం కూడా పూర్తి స్థాయి కార్యదర్శి లేకపోవడంతో గ్రామ పరిపాలన, అభివృద్ధి పనుల పర్యవేక్షణ సక్రమంగా జరగడం లేదని తెలియజేశాము.గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించిన బాధ్యత సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు సంబంధిత అధికారులపై కూడా ఉన్నందున, ఈ వ్యవహారంలో సర్పంచ్, ఉపసర్పంచ్, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ మరియు బాధ్యులందరి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా నాణ్యతా లోపాలు జరిగినట్లు తేలితే శాఖాపరమైన చర్యలతో పాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరాము.ప్రజాధనం దుర్వినియోగం కాకుండా,



గ్రామంలో నాణ్యమైన అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులెవ్వరినీ ఉపేక్షించకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గుడిమల్కాపురం గ్రామపంచాయతీ మెజార్టీ వార్డ్ సభ్యులమైన మేము జిల్లా కలెక్టర్ గారిని విజ్ఞప్తి చేశాము. ఈ కార్యక్రమంలో రెండు వార్డు సభ్యులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్,4 వ వార్డు సభ్యులు ఏనుగు రఘుపతి,5 వార్డు సభ్యులు ఉడుగు నాగరాజు,6 వార్డ్ సభ్యులు టంగుటూరు పద్మ,7 వ వార్డు సభ్యులు సయ్యద్ పాషా పాల్గొన్నారు.

# ఎదురుగాలిలో జీవన ప్రయాణం

ఒక చిన్న దీపం. చుట్టూ భయంకరంగా వీస్తున్న బలమైన గాలులు. ప్రతి క్షణం ఆరిపోతుందేమోనన్న దిగులు, భయం. అయినా సరే, అది ఓపికగా వెలుగుతూనే ఉంటుంది. మెల్లగా, వణుకుతూనే తన ఉనికిని చాటుకుంటుంది. ఎంత పెద్ద సుడిగాలి వచ్చినా ఆరిపోకుండా నిలబడటమే దానికి తెలుసు. సరిగ్గా మనిషి జీవితం కూడా ఇలాంటి ప్రమిదలోని దీపమే. అను నిత్యం బతుకు పోరాటంలో కష్టాలు, నష్టాలు, ఎదురుదెబ్బలు అనే సుడిగాలులు ఉవ్వెత్తున వీస్తూనే ఉంటాయి. అయినా సరే, మానవ అంతరంగంలో మెరిసే ఆశ అనే చిరుదీపం మాత్రం ఆరిపోకుండా వెలుగులు చిమ్ముతూనే ఉంటుంది. సరిగ్గా ఇదే మనుగడ యొక్క అత్యంత గొప్ప రహస్యం, దివ్యమైన సౌందర్యం అని చెప్పక తప్పదు.సమాజంలో ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక దశలో రోదనలు, వేదనలు తప్పవు. కొందరిని ఆర్థిక నిరుత్సాహం, అప్పుల అగ్నిగుండం దహించివేస్తే, మరికొందరిని దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు నరకం చూపిస్తాయి. ఇంకొందరికి పేగుబంధాలు, అనుబంధాల్లో ఎదురయ్యే నష్టాలు శూలంగా మారితే, మరికొందరికి తమ ఆశలు, కలలు కల్లలైన తీవ్రమైన నైరాశ్యం మిగులుతుంది. ఈ జగత్తులో ఎవరి సమస్యలు వారివి, ఎవరి పోరాటం వారిదే.



సమాజంలో పైకి చిరునవ్వులతో కనిపించే వ్యక్తులు, తమ అంతరంగంలో ఎంతటి విషాదాన్ని, అశ్రువులను దాచుకుంటున్నారో ఎవరూ అంచనా వేయలేరు. ఇతరుల గాయాలకు మందు వేసే సామాజిక శక్తులు, కవులు, వైద్యులు లేదా మార్గదర్శకులు కూడా తమ సొంత మానసిక గాయాలను మాన్చుకోలేకపోవడం నేటి సమాజంలోని పెద్ద వైరుధ్యం. తోటివారికి సాంత్వన చేకూర్చే మనసు, తనకు తానుగా ఓదార్పు లభించక తల్లడిల్లిపోవడం అత్యంత విషాదకరం. కానీ, ఇదే పచ్చి జీవన సత్యం. ఇతరుల సంక్షేమం కోసం జీవించే క్రమంలో, మనుషులు తమ సొంత బాధలను మనసు పొరల్లోకి నెట్టేస్తుంటారు. అయినా ఆ గాయాలు నివురుగప్పిన నిప్పులా లోలోపలే దాగ ఉంటాయి.అయితే, మానవ మనుగడ అంటే కేవలం కన్నీళ్ల కావ్యమే కాదు. ఒక వైపు నవ్వు, మరో వైపు కన్నీరు ఈ రెండింటి సమాహారమే సమగ్ర జీవితం. సంతోషం, దుఃఖం అనే రెండు చక్రాలపైనే బతుకు బండి పయనిస్తుంది. ఒక క్షణంలో ఆనంద తీరాలు తాకితే, మరుక్షణంలోనే విషాద సాగరంలో మునిగిపోవడం సహజం. ఈ విభిన్నమైన మిశ్రమమే మనుగడను పరిపూర్ణం చేస్తుంది.కేవలం నిరంతర ఆనందమే ఉంటే ఆ జీవితానికి విలువ ఉండదు. అలాగే, కేవలం దుఃఖమే రాజ్యమేలితే జీవితం భరించలేని నరకప్రాయంగా మారుతుంది. ఈ రెండింటి సమతుల్యతే మానవ మనుగడకు అర్థాన్ని ఇస్తుంది. హృదయాలు ద్రవించే క్షణాలు, అనుబంధాలు కరిగే సందర్భాలు మనిషిని మనిషిగా నిలబెడతాయి. ఒకరి కష్టాన్ని చూసి మరొకరి హృదయం ద్రవించడం, పక్కవారి బాధకు కంటతడి పెట్టడం మానవత్వానికి నిలువెత్తు రూపం. ఈ సున్నితమైన భావోద్వేగాలే సామాజిక అనుబంధాలను, రక్తసంబంధాలను మరింత బలోపేతం చేస్తాయి.జీవన రథం సాగే క్రమంలో కష్ట సుఖాలు రెండూ క్రమం తప్పకుండా వస్తుంటాయి. కష్ట కాలంలో మనిషి ఆవేదన, పరీక్షలు ఎదుర్కొంటూనే ఓర్పును పాఠంగా నేర్చుకుంటాడు, ఇది అంతిమంగా అంతర్గత మనోధైర్యాన్ని బహుమతిగా ఇస్తుంది. అలాగే సుఖ కాలం వచ్చినప్పుడు మనసు ఆనందం, తృప్తి, నిశ్చింతతో నిండిపోయి, జీవితంపై ఉన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తుంది. ఈ రెండు అనుభవాల కలయికే బతుకు పయనానికి సరైన అర్థాన్ని ఇస్తుంది.అనుకోకుండా విరుచుకుపడే కష్టాలు, ఆకస్మిక ప్రమాదాలు కాలచక్రంలో భాగమే. కొన్నిసార్లు జీవితంలో కల్లోలమైన పరిస్థితులు విషపూరిత వర్షంలా కురుస్తున్నట్టు అనిపిస్తుంది. కాలం మనల్ని తీవ్రంగా పరీక్షిస్తున్న తరుణంలో, నాలుగు వైపులా చీకట్లు కమ్ముకుని, ఇక రేపటి తెలవారుజాము వస్తుందా లేదా అనే అనుమానం కలగడం సహజం.కానీ, ప్రకృతి కాలచక్ర నియమం ప్రకారం ఎంత సుదీర్ఘమైన కాళరాత్రి అయినా సరే, తెల్లవారక తప్పదు. చీకటిని చీల్చుకుంటూ భానుడి కాంతిరేఖలు ఉదయించి తీరుతాయి. అలాగే, మానవ ప్రయాణంలో కూడా ప్రతి కష్టకాలం ముగిసిన తర్వాత సుఖ సంతోషాల కాలం వచ్చి తీరుతుంది. ఇది శాశ్వతమైన ప్రకృతి సిద్ధాంతం. ఆ ఆనంద కిరణాలు ప్రసరించే సమయం కోసం ప్రశాంతంగా వేచి చూడటం, ఓపిక పటడం, ఆశావాద దృక్పథంతో అడుగులు ముందుకు వేయడమే మనం చేయాల్సిన పని.విధి ఆడే విచిత్రమైన నాటకంలో, అంతటి భారమైన దుఃఖాన్ని మనసు మోయగలదా అనే సందేహం ప్రతి ఒక్కరిలోనూ ఉదయిస్తుంది. బలహీనులు ఈ విధి భారానికి లొంగిపోయి మానసికంగా కుంగిపోతారు. కానీ, ధైర్యవంతులు ఆ భారాన్నే ఇంధనంగా, ఆయుధంగా మలచుకుని విజయతీరాలకు చేరుకుంటారు.వాస్తవానికి కష్టాలు మనిషిని బలహీనపరచవు, మరింత దృఢంగా మారుస్తాయి. ప్రతి పతనం తర్వాత పట్టుదలతో లేచి నిలబడే అపరిమిత శక్తి ప్రతి మనిషిలోనూ ఉంటుంది. దాన్ని సరైన సమయంలో మేల్కొలపడమే ముఖ్యం. సంక్షోభాల్లో కుంగిపోకుండా, సవాళ్లను స్వీకరించే మనోధైర్యాన్ని పెంపొందించుకోవడమే నిజమైన గెలుపు.అణగారిపోతున్న ఆశ అనేది ఏదో ఒక సందర్భంలో మళ్ళీ కొత్త చిగురు తొడుగుతుంది. మనిషి తనలోని అంతర్గత ఆశను సజీవంగా ఉంచుకుంటే, ఎంతటి ప్రళయ తుఫాను వచ్చినా ఎదుర్కొని నిలబడగలడు. ఆశ అనేది ప్రకృతి మానవాళికి ఇచ్చిన అమూల్యమైన వరప్రసాదం. ఈ ఆశే మనిషిని ముందుకు నడిపిస్తుంది, రేపటి ఉదయంపై విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. చరిత్రను తిరగేస్తే, కష్టాల సుడిగుండంలో కూడా ఆశను కోల్పోని మహానుభావులే చరిత్రసృష్టికర్తలుగా మారారు. ఎంత పెద్ద గాలి వీచినా, ఆశాదీపం వెలగడం మానదనే గొప్ప సత్యాన్ని వారి జీవితాలు నిరూపించాయి.ప్రస్తుత ఆధునిక ఉరుకుల పరుగుల యుగంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక, సామాజిక సుడిగాలిని ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సంక్షోభాలు, సామాజిక సమస్యలు మనిషిని నిలువునా పిప్పి చేస్తున్నాయి. కానీ, ఈ గందరగోళం మధ్య కూడా మనం మన అంతరంగాన ఉన్న ఆశాదీపాన్ని ఆరిపోకుండా చూసుకోవాలి.ఒకరికొకరు తోడుగా నిలబడటం, కష్టాలను పంచుకోవడం, ఇబ్బందుల్లో ఉన్నవారికి కొండంత ధైర్యాన్ని ఇవ్వడం సమాజ పునాదులను బలపరుస్తాయి. మానసిక ఒంటరితనంలో ఉన్నప్పుడు, మన చుట్టూ ఉన్నవారి ఆప్యాయతలను, ప్రేమాభిమానాలను గుర్తించగలిగితే బతుకు పయనం ఎంతగానో సులభమవుతుంది.మొత్తంగా చెప్పాలంటే, మానవ జీవితం అనేది ఒక నిరంతర సంగ్రామం. ఈ యుద్ధంలో గెలవడం అంటే కష్టాలే లేకపోవడం కాదు. ఎన్నో కష్టాలు, సవాళ్లు చుట్టుముట్టినా ఆశను కోల్పోకుండా నిలబడటమే అసలైన విజయం. సుడిగాలి ఎంత విరుచుకుపడినా దీపం వెలుగుతూనే ఉంటుంది, ఎందుకంటే దానికి కాంతిని పంచడమే తెలుసు తప్ప, ఆరిపోవడం తెలీదు.మనమందరం కూడా అలాంటి ఆశాదీపాలుగా మారాలి. ఎంతటి విపత్తు వచ్చినా, లోపలి ఆశాదీపాన్ని ఆర్పకుండా, ముందుకు సాగుతూ జీవితాన్ని ఒక సుందర ప్రయాణంగా మలచుకోవాలి. ఇదే అసలైన జీవన కళ, మానవజాతికి ప్రకృతి నేర్పే గొప్ప పాఠం.

డా .సూర్యదేవర రామకృష్ణ, 9490754169



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

## రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక



- సి.ఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, వెలుతురు జూలై 21 :**

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎకో టూరిజం అభివృద్ధి, పులుల సంరక్షణ, టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో అటవీ శాఖ, పర్యాటక శాఖ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సి.ఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎకో టూరిజం ను అభివృద్ధి పరచి తద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడంతో పాటు పర్యటక రంగం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేకంగా భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న కిన్నెరసాని, శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతాలలో అమ్రాబాద్, గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న కవ్వాల్ టైగర్ రిజర్వు, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎకో టూరిజం ను అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలో విలువైన అటవీ సంపద ఉందని, జీవ వైవిధ్యం, సహజ ప్రకృతి అందాలను పర్యాటక అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తే , ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జి.డి.పి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవల్మెంట్ కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ సూచించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ , అనంతగిరి ,వికారాబాద్,సిటీ అర్బన్ ప్రాంతాలలో ఎకో టూరిజంను ప్రోత్సహించాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, PCCF వినయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ‘పిక్సెల్ ఎల్ఈడీ’ నూతన ప్రాంతీయ కార్యాలయం ఘనంగా ప్రారంభం

- **ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ కె. నరసింహ**
- **ఆకట్టుకుంటున్న అత్యాధునిక ఎల్ఈడీ సాంకేతిక ఉత్పత్తులు**

**ఎల్బీ నగర్, వెలుతురు జులై 21:**

అస్మాన్‌గఢ్‌లో ప్రముఖ ఎల్ఈడీ డిస్ప్లే తయారీ సంస్థ పిక్సెల్ ఎల్ఈడీ ప్రైవేట్ లిమిటెడ్ నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మలక్‌పేట్ సీఐ కె. నరసింహ రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ వేడుకలో సంస్థ డైరెక్టర్లు సందీప్ కేర్ సింగ్ (సేల్స్ అండ్ టెక్నాలజీ), ఎం.ఏ. అలీమ్



(సౌత్ ఇండియా సేల్స్ అండ్ సర్వీస్), మృత్యుంజయ్ కుమార్ సింగ్ (సేల్స్ అండ్ సర్వీసెస్)తో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ఆహ్వానితులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు అత్యాధునిక ఇండోర్, అవుట్‌డోర్ ఎల్ఈడీ డిస్ప్లేల సాంకేతిక విశేషాలను అతిథులకు వివరించారు.సంస్థ డైరెక్టర్లు మాట్లాడుతూ, ఢిల్లీ, ముంబై నగరాల తర్వాత దక్షిణ భారతదేశంలో తమ వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇండోర్, అవుట్‌డోర్ ప్రకటనలు, ఈవెంట్ల కోసం అత్యుత్తమ నాణ్యత గల ఎల్ఈడీ డిస్ప్లేలను ఆధునిక సాంకేతికతతో పాటు మెరుగైన సర్వీస్ సపోర్ట్‌తో వినియోగదారులకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన సీఐ కె. నరసింహతో పాటు ఇతర అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డ్ లో వర్క్ చేసే సివరేజ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: పి.నారాయణ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 21:**

వాటర్‌బోర్డ్ లో పని చేసే సివరేజ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని HMWSSB కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
మంగళవారంహెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బిలో పని చేసే శివరేజ్ కార్మికుల సమావేశం సూరారంలో యూనియన్ శివరేజ్ విభాగం అధ్యక్షుడు వాసు గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశానికి ముఖ్య అతిథిలుగా యూనియన్ అధ్యక్షులు నారాయణ హాజరై మాట్లాడుతూ...

పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా



అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అన్నీ సౌకార్యాలు కల్పించాలని, రెయిన్‌కోట్స్, సబ్బులు, నూనెలు, హ్యాండ్‌వాష్, శానిటైజర్, టవల్స్, యూనిఫారాలు, గ్లౌజులు, బూట్లు, పనిముట్లు, ఇతర పరికరాలన్ని సరాఫరా చేయాలన్నారు. వారాంతపు సెలవులు అదనపు పనికి అదరపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా, ఆరోగ్య భీమా చేయాలన్నారు. ఏజెన్సీ ఈఎస్ఐ, పీఎఫ్ కార్డులు అందజేయలన్నారు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రమేష్, మహేష్, ప్రవీణ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (AICC) అధ్యక్షులు గౌరవ నీయులు మల్లికార్జున ఖర్గే గారికి జన్మదిన శుభాకాంక్షలు

- **డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 21:**

రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల మీ అచంచల నిబద్ధత దేశవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తోంది. మీకు ఆయురారోగ్యాలు, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.



# కొంగరర గ్రామంలో వెంచర్ వేటుకు కూలిన 125 తాటిచెట్లు

- ఉపాధి కోల్పోయిన 500 కుటుంబాలు చెట్టుకు లక్ష చొప్పన పరిహారం ఇవ్వాలి
- గౌడ సంఘం నాయకులు పల్లె గోపాల్ గౌడ్, కొత్త అశోక్ గౌడ్, కొత్త యాదగిరి గౌడ్






**ఇబ్రహీంపట్నం వెలుతురు జూలై 21:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ గ్రామంలో రియాల్టర్ల వేటుకు వందలాది తాటి చెట్లు నేలకూలాయి తాటిచెట్లనే ఆధారం చేసుకుని జీవనంసాగిస్తున్న సుమారు 500 కుటుంబాలగీత కార్మికులు వీధిన పడ్డారు అకారణంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెట్ల తొలగింపును నిర సిస్తూ కొంగరకలాన్ గ్రామంలో గీతకార్మికులు ఆందోళనకు దిగారు సదరు వెంచర్ గేట్ ఎదుట ని రాహార దీక్షకు పూనుకున్నారు దాంతో వారి నిరాహార దీక్ష4వరోజుకు చేరింది.చెట్టుకు ఒక లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని గీతకా ర్మికులు డిమాండ్ చేశారు వీరి ఆందోళ నకు గీతకార్మిక సంఘం జిల్లారాష్ట్రస్థాయి నాయకులు సంఘీభావంతెలిపారు సదరు రియాల్టరు వెంటనే గీత కార్మికులతో చర్చలు జరిపి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సం దర్భంగా గీతకార్మిక సంఘం రాష్ట్రనాయకులు పల్లె గోపాల్ గౌడ్ కొత్త అశోక్ గౌడ్ మాజీ సర్పం చ్ కొత్తయాదగిరి మాట్లాడుతూ గీతవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీత కార్మికులను పొట్టగొడుతూ చెట్లతొలగింపు చేయడం అన్యాయమన్నారు సుమారు125 చెట్లను అకారణంగా తొలగించారని ఆందోళన వ్యక్తంచేశారు ప్రతి సంవత్సరానికి ఒక్కోచెట్టు 50,000/ రూపాయలు ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారుభూమి మాత్రమే రైతుదని అందులో పెరిగిన తాటి చెట్టుపైగీత కార్మికునికి హక్కుఉంటుందని తెలిపారు లేదంటే తాటిచెట్టు కిందఉన్న నీడవచ్చే భూమి కూడా గీత కార్మికునికి చెందుతుం దన్నారు అలాంటి చెట్లను నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీతకార్మికు ల ఉపాధిని దెబ్బతీస్తూ చెట్లను తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు చట్టపరంగా కొనసా గుతున్న గీతకార్మిక సంఘం అనుమతి లేకుండా ఎలాచెట్లను తొలగి స్తారని ప్రశ్నించారు అక్రమ మార్గంలో అనుమతులు ఉన్నాయని చెబుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చలవిడి గాతాటి చెట్లు ఈత వనాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.చెట్టుకు1,00,000/ రూపాయలు చొ ప్పున కోటి 25 లక్షల రూపాయలుగీత&ఈత కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు అప్ప టి వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు దీక్షచేపట్టిన గీతకార్మి కులతో చర్చలు జ రిపేందుకు దీక్షాశిబిరం వద్దకు సదరు వెంచరు డెవెలపర్స్ వచ్చారు గౌడ సంఘం నాయకులతో చర్చలు జరిపారు తాము20 లక్షలవరకు నష్టపరిహారం కింద చెల్లిస్తామని రియాక్టర్ పేర్కొన్నా రు అందుకు గౌడ సంఘం ప్రతినిధులు ససేమిరా అన్నారు చెట్టుకు లక్ష చొప్పున పరిహారం చె ల్లించాల్సిందేనని పట్టుబట్టారు దాంతో చర్చలు విఫల మయ్యాయి మరోసారి కూర్చొని మాట్లా డదామని నిర్ణయించారు ఈకార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నీళ్ల రమేష్ గౌడ్ అ ర వింద గౌడ్ నీల ధనరాజ్ గౌడ్ శ్రీ నివాస్ గౌడ్ బాలరాజు గౌడ్ గీత కార్మిక సంఘం నాయకులు శిగ వీర స్వామిగౌడ్ హరిదాసు గౌడ్ పురుషోత్తం గౌడ్ బలరాం గౌడ్ నీళ్ల రమేష్ గౌడ్ పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బండలేమూర్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ప్రతి ఓటర్ బూత్ లెవెల్ అధికారులకు సహకరించి పత్రాలు సమర్పించాలి ఓటు కోల్పోకుండా చూసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి



**మంచాల వెలుతురు జూలై 21:**

మంచాల మండలం ఎస్ ఐ ఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వివిధ గ్రామాల్లో పర్యటించి ఎస్ ఐ ఆర్ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటర్ సవరణఅభ్యంతరాలు స్వీకరించడం మరి యు ఓటరు వివరాలు నమోదుచేయడం శుభప రిణామం దేశంలో రాష్ట్రంలోఉన్నరెండు ఓట్ల విధానం స్వస్తి పలికి ఒకేఓటు విధానాన్ని ప్రవేశపెట్టడం చాలామంచిది గ్రామప్రజలు ఈఅవకా శాన్ని ప్రతిఓటరు వినియోగించుకొని ఓటు కోల్పోకుండా ఓటర్ సవరణ పత్రాలు సమర్పించాలి అని అన్నారుప్రజ లందరూ ఈయొక్కఓటరు సవరణపైన అవగాహన లేక ఇబ్బందులు గురవు తున్నారు ఈఎస్ ఐ ఆర్ పామ్స్ సమర్పించక పోతే ఓట్లు అనేవి ఓటర్ లిస్టులో తొలగించబ డ తాయని రాష్ట్రఎన్నికల సంఘం ప్రకటించింది కాబట్టి ప్రజలంతాఈయొక్కఅవకాశాన్ని వి నియోగించుకుని అందరూ గ్రామపంచాయతీలవద్ద తమయొక్కఫోటోతో కూడిన ఆధార్ కార్డు తోవచ్చితమ సంబంధిత బిఎల్ ఓ అధికారులను కలిసి తమయొక్క ఫారంను సమర్పించాలని అని అన్నారు గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఒక్కఓటుకో ల్పోకుండా దగ్గ ర ఉండి ఓటర్ సవరణ పత్రాలు బిఎల్ ఓ అధికారులకు సమర్పించేలా చూడాలని అని అన్నా రు కార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ ఆ రుట్ల మాజీ ఎంపిటిసి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ బండలేమూర్ మాజీ ఎంపీటీసీ వేదిరే మధు సూదన్ రెడ్డి మంచాల సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ బండలేమూర్ మాజీసర్పంచ్ పాతులో త్ మంగ శ్రీనివాస్ నాయక్ మాజీ ఉపసర్పంచ్ కిషన్ నాయక్ బండలేమూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యాల ఐలయ్య యాదవ్ నాయకులు నారెడ్డి హరికిషన్ రెడ్డి మంచాల గ్రా మపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ బి ఎల్ ఓ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని దోచుకోవడంమే తప్పా.. అభివృద్ధి శూన్యం...

- ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బీజేపీ పాదయాత్ర.. ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యంపై కుమార్ యాదవ్ ఆగ్రహం...



**కూకట్ పల్లి, జూలై 21 వెలుతురు:**

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఎల్లమ్మబండ హనుమాన్ టెంపుల్ నుంచి ఎన్‌టీఆర్ నగర్ కాలనీ మీదుగా జయశంకర్ కాలనీ వరకు ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, కేశవరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర సందర్భంగా కాలనీల్లో పర్యటించిన నాయకులు స్థానిక ప్రజల నుంచి డ్రైనేజ్, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ప్రజలు ఎన్నో మౌలిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం, మంచినీటి సరఫరాలో అంతరాయాలు, పారిశుద్ధ్య లోపాలు కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, డివిజన్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కంటే కబ్జాలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది వెంటనే స్పందించి డ్రైనేజ్, మంచినీటి, పారిశుద్ధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మణి భూషణ్, వెంకటస్వామి రెడ్డి, రఘు, అనిత, నరసింహచారి, జ్యోతి, సురేష్, శ్రీనివాస్, భరత్, శ్రీను, ప్రకాష్, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, అంజి, విష్ణు, రమేష్, నరసింహ, హర్ష తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరకత శివాలయాన్ని దర్శించుకున్న ఇస్రో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ దంపతులు

**శంకర్ పల్లి, వెలుతురు జులై 21:**



మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన చారిత్రాత్మక 11వ శతాబ్దపు శ్రీ మరకత శివాలయాన్ని ఇస్రో శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, ఆయన సతీమణి కృష్ణవేణి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సైంటిస్ట్ దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ యాదవ్, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి, ఆలయ వైస్ చైర్మన్ సిహెచ్ నరసింహులు, ప్రధాన అర్చకులు సాయి శివ, కమిటీ సభ్యుడు హనుమంతు లు కలిసి సైంటిస్ట్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారి మరకత లింగ చిత్రపటాన్ని, ప్రసాదాన్ని వారికి జ్ఞాపికగా అందజేశారు.ఈ సందర్భంగా రిటైర్డ్ సైంటిస్ట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 11వ శతాబ్దం నాటి అరుదైన మరకత శివాలయాన్ని దర్శించుకోవడం అత్యంత ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని, ఆలయ ప్రశాంత వాతావరణం మనస్సుకు ఎంతో ప్రశాంతతను చేకూర్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# యువకులు డ్రగ్స్ మద్యపానానికి గంజాయి అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలి

- ఆరుట్ల గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు లాలగారి మన్నెమ్మ

**మంచాల వెలుతురు జులై 21:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో 13వ వార్డు సభ్యురాలు లాలగారి మన్నెమ్మ మాట్లాడు తూనేటి సమాజంలో యువతను అత్యంత ప్రమాదకరంగా ప్రభావితం చేస్తున్న సమస్యల్లో డ్ర గ్స్ ఒకటిడ్రగ్స్‌కు బానిసైన యువత తమ ఆరోగ్యం.కుటుంబం చదువు భవిష్యత్తును కోల్పోయే ప్రమాదంఉంది అని అన్నారు అందుకే ప్రతి ఒక్కరూ ఈసమస్యపై అప్రమత్తంగా ఉండాలి తల్లి దండ్రులు పిల్లలపై ప్రేమతో పాటు నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలి ఉపాధ్యాయులు విద్యా ర్థుల్లో అవగాహన పెంచాలి యువత చెడుస్నేహాలకు మాదకద్రవ్యాల ప్రలోభాలకు దూరంగా ఉండి క్రీడలు విద్యఉపాధి సమాజ సేవవంటి సానుకూల మార్గాలను ఎంచుకోవాలి మంచి మార్గంలో నడవాలిమన గ్రామం మన సమాజం డ్రగ్స్ రహితంగా ఉండాలంటే ప్రజలు యువత అ ధికారులు కలిసి పనిచేయాలి అనుమానాస్పదంగా డ్రగ్స్ విక్రయించే లేదా వినియోగించే వారి గురించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలిడ్రగ్స్ కు దూరంగా ఉండం డి ఆరోగ్యకరమైన బాధ్యతాయుతమైన జీవితాన్ని నిర్మించండి యువతను కాపాడటం ప్రతి ఒ క్కరి బాధ్యత అనిఅన్నారు.



# ఆరుట్లలో తిమ్మగళ్ళ బుగ్గయ్య దశదినకర్మకు వారి కుటుంబానికి బియ్యం అందజేసిన బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

- సామాన్యుల జీవితాలలో వెలుగులు నింపడమే బిఅర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ల క్ష్యం ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము

**మంచాల వెలుతురు జులై 21:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన తిమ్మగల్ల బుగ్గయ్య కుటుం బాన్ని పరామర్శించిన బిఆర్అర్ ఫౌండేషన్ సభ్యులు తిమ్మగళ్ళ బుగ్గయ్య కుటుంబ సభ్యుల ను ఓదార్చి ప్రాగాడసానుభూతి తెలిపి బుగ్గయ్య దశదినకర్మ కార్యక్రమానికి బియ్యం.పంపిణీ చేశా రు ఈసందర్భంగా బిఅర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము మాట్లాడుతూతిమ్మగళ్ళ బుగ్గయ్య ఆకాలమరణం వారి కుటుంబకి తీరనిలోటని వారి కుటుంబానికి ఆభగవంతుడు ధై ర్యాన్ని ఇవ్వాలని కోరారు ప్రతిపేద కుటుంబానికి అండగా నిలబడాడమే బిఆర్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి లక్ష్యం అనిఅన్నారు ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ సద్దాం మంకు అంజయ్య కొండిగారి లక్ష్మణ్ బుచ్చిరాములు బర్మల వెంకటేష్ షాకీర్ గుడిమల్ల బాలరాజు బాహుబలి శివ మనోహర్ తరుణ్ మరియు వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బొల్లారం వెంకటరెడ్డి ఎన్నిక



- మున్సిపల్ అధ్యక్షుడిగా మడుపతి చంద్రమౌళి ఎన్నిక
- ఎమ్మెల్యే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షులు

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 21 :**

చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీలకు నూతన అధ్యక్షుల నియామకాన్ని కాంగ్రెస్ అధిష్టానం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఇందులో భాగంగా, శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బొల్లారం వెంకటరెడ్డిని , మున్సిపల్ అధ్యక్షుడిగా సింగపురం వార్డుకు చెందిన మడుపతి చంద్రమౌళి ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన మండల, మున్సిపల్ అధ్యక్షులు మంగళవారం నాడు చేవెళ్ల నియోజకవర్గ శాసన సభ్యులు (ఎమ్మెల్యే) కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్యకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు ఎమ్మెల్యే యాదయ్యకు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మండలంలో, మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శ్రేణులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి ముఖ్య కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొగుల్ల రాజిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 21:**

తెలంగాణ రాష్ట్ర జలమండలి అధ్యక్షులు యూనియన్ అధ్యక్షులు, ఐఎన్ టియుసి తెలంగాణ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ల రాజిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు.ఈసందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి గ్రీన్ హిల్స్ కాలనీతో పాటు పలు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు మరియు సీవరేజ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా వారు ఆయనకు విన్నవించారు. ఆయన సానుకూలంగా స్వీకరించి, వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు ఐఎన్ టియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అత్తిలి రవికాంత్ గౌడ్, జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, సాధుయాదవ్, నరసింహారెడ్డి, పద్మారావు, గురువారెడ్డి, కృష్ణయాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ప్రజలపై పోలీసుల దమనకాండను ఖండించండి:సిపిఐ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 21:**

ఢిల్లీలో నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో శాంతియుతంగా విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలపై పోలీసులు జరిపిన దమనకాండను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. అలాంటి నిరసనను బలప్రయోగంతో అణచివేయడం, నిరసనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అభివర్ణించారు.నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలను వ్యక్తం చేశారు. పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వాటిపై స్పందించకుండా నిరసనలను అణచివేయడానికి పోలీసులను ఉపయోగించడం అత్యంత బాధాకరం, ప్రజల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కాదన్నారు. సిపిఐ తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలి. పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ప్రజలపై దమనకాండకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించాలన్నారు.



# పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- **యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవాని శంకర్ ,మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్**



**యాదగిరిగుట్ట , జూలై 21 ( వెలుతురు న్యూస్ )**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటామని యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవాని శంకర్ యాద గిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత గౌడ్ అన్నారు మంగళవారం యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి దేవస్థానం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే 29వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయంగా తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పెన్షనర్ల సంఘం నేతలు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు తమ సంక్షేమానికి దేవస్థానం ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకారం అందించాలని అన్నారు ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లను ఘనంగా శాలువాలు పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కలకుంట్ల బాల్ నర్సయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి కొక్కొండ యాదగిరి ముఖ్య అతిథులను ఆహ్వానితులను పెన్షనర్లను ఘనంగా పూలమాలలు శాలువాలతో సత్కరించారు. సంఘం నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం పెన్షనర్ల సంఘం సంఘం గౌరవ అధ్యక్షు కుంతీపురం శేషాచార్యులు , అధ్యక్షులు ఊడెపు నరసింహ రావు కార్యనిర్వాహక అధ్యక్షులు కలకుంట్ల బాల్ నర్సయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి కొక్కొండ యాదగిరి సంఘం కార్యవర్గ సభ్యులు సన్మాన గ్రహీతలు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో సి. సి. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**మోత్కూర్, జులై 21,వెలుతురు న్యూస్ :**




తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సహకారంతో 5 లక్షల రూపాయల ఎంపీ నిధులతో మంగళవారం నాడు పనకబండ గ్రామంలో సి.సి.రోడ్ పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి అలివేలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని ధర్మయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ కారుపోతుల ముత్యాలు, వార్డు సభ్యులు ఒర్సు సుజాత,బట్టు మచ్చగిరి,వల్లందాసు కీర్తన,కారుపోతుల పుష్పా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నకిరే.కంటి రామనర్సయ్య,బత్తిని శేఖర్,ఒర్సు శ్రీను,బత్తిని తిరుమలేష్,కారుపోతుల చంద్రయ్య,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంత నిర్లక్ష్యమా...ప్రమాదకరంగా విద్యుత్ మీటర్

- **వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 21:**



నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని న్యూ ఎస్సీ కాలనీకి సంబంధించిన గ్రామ పంచాయితీ పబ్లిక్ బోర్ వద్ద ఏర్పాటు చేసిన త్రీ–ఫేజ్ విద్యుత్ మీటర్ డోర్ ఊడిపోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కమ్యూనిటీ హాల్ గేట్‌కు తాళం లేకపోవడంతో బడి సెలవు రోజుల్లో చిన్నారులు అక్కడికి వచ్చి, తెలియక విద్యుత్ మీటర్‌ను ముట్టుకునే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయాన్ని గతంలో అప్పటి గ్రామ కార్యదర్శి సుభానొద్దీన్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు వాపోయారు.ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, గ్రామపంచాయతీ అధికారులు మరియు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్‌కు డోర్ ఏర్పాటు చేసి, కమ్యూనిటీ హాల్‌కు తాళం వేయించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ధర్మారెడ్డి కాల్వ జీరో పాయింట్ నుండి దిగువ ప్రాంతాలకు సాగునీటి విడుదల





**వలిగొండ వెలుతురు న్యూస్ జూలై 21:**

మండలం ధర్మారెడ్డి కాలువ జీరో పాయింట్ వద్ద నుండి దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేసిన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మరియు స్థానిక భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ,భువనగిరి, నకిరేకల్ నియోజకవర్గాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ధర్మారెడ్డి కాలువ ద్వారా నేడు నీటిని విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాలువ పనులను వేగవంతంగా పూర్తి చేశామని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలువల ఆధునీకరణ చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,ధర్మారెడ్డి కాలువ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సాగునీటిని అందించడం సంతోషకరమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఈ పనులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేశామని తెలిపారు. గతంలో నీళ్లు, నిధులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు ధర్మారెడ్డి కాలువ పూర్తవడంతో ఈ నీళ్ల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే తెలిపారు.

# పెండ్యాల దేవయ్య–ఎల్లమ్మ–లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా అన్నదానం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 21:**

కట్టంగూర్ మండలం పరడ గ్రామానికి చెందిన కీ.శే. పెండ్యాల దేవయ్య, ఎల్లమ్మ, లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా వారి మనవళ్లు, మనవరాళ్లు కలిసి మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 604వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భిక్షాటన చేసే వారు, నిరుపేదలు, బాటసారులు, నిస్సహాయులు కలిపి 100 మందికి అన్నదానం చేశారు.కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, పెండ్యాల దేవయ్య, ఎల్లమ్మ, లక్ష్మమ్మ తమ కుటుంబ పెద్దలు, పితృదేవతలని, వారి ఆశీస్సులు తరతరాలకు ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. వారు తమ మధ్య లేకపోయినా వారి జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోవని, ఆర్థికంగా పెద్ద స్థితిలో లేకపోయినా ఇతరులకు సహాయం



చేయాలనే స్ఫూర్తిని తమకు అందించారని చెప్పారు. అదే స్ఫూర్తితో నేడు 100 మంది నిరుపేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గుంటూరి ఈశ్వర్ రావు, విక్రమాచారి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం రిజర్వాయర్లు మంజూరు చేసి, భూపరిహారం ఇవ్వకుండా ఆ రిజర్వాయర్లలోకి నీటిని ఎక్కడి నుండి తీసుకురావాలనే విషయాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్

- **తన రాజీనామా తో ప్రభుత్వాన్ని భూనిర్వాసితుల కాళ్ల దగ్గరికి తీసుకొచ్చి భూనిర్వాసితులకు పరిహారం అందేలా చేసిన రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు వెలుతురు జూలై 21:**




పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగు త్రాగునీరు అందించడానికి గత పాలకులు ఈ రెండు నియోజకవర్గాలలో రిజర్వాయర్ల పనులు మొదలుపెట్టారు.. మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్ల కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పరిహారం చెల్లించకుండానే పనులు మొదలుపెట్టారు. ఎన్నిసార్లు భూపరిహారం కోసం అసెంబ్లీలో రాజ్ గోపాల్ రెడ్డి గారు కొట్లాడిన నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం..తాను గెలిచి ఈ నియోజకవర్గానికి ఏమి చేయలేకపోతున్నాననే ఆవేదనతో తాను రాజీనామా చేస్తేనన్న అభివృద్ధి జరుగుతుందని భావించి రాజీనామా చేశారు...రాజ్ గోపాల్ రెడ్డి గారి రాజీనామాతో ప్రభుత్వం భూనిర్వాసితుల కాళ్ల దగ్గరికి వచ్చి మరి పరిహారం అందించింది..1756 మందికి భూ పరిహారం తో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన నిదులు యుద్ధప్రాతిపదికన విడుదల చేసి ఇచ్చారు...రాజ్ గోపాల్ రెడ్డి రాజీనామాతో అప్పటివరకు భూనిర్వాసితులను పట్టించుకోని బీఆర్ ఎస్ ప్రభుత్వం సుమారు 180కోట్ల నుండి 200 కోట్ల వరకు పంచాల్సి వచ్చింది.ఆతరువాత ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచినా రిజర్వాయర్ పనులలో ఎటువంటి పురోగతి పనులు కొనసాగలేదు..ప్రజాప్రభుత్వం అదికారంలోకి వచ్చాకే నిర్మించిన రిజర్వాయర్లకు ఎక్కడి నుండి నీటిని తీసుకురావాలనే దానిపై రిటైర్ట్ ఇంజీనీర్ల బ్రుందంతో వ్యక్తిగతంగా ఎన్నోమార్లు సమీక్షలు జరిపిన రాజ్ గోపాల్ రెడ్డి గారు ఏదుల నుండి నీటిని తరలించాలని ప్రభుత్వానికి విన్నవించారు...నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిగారితో ఎన్నో మార్లు చర్చించి ఏదుల నుండి నీటిని తరలించేలా వెంటనే టెండర్ల ప్రక్రియను కూడా పూర్తిచేశారు...దానికి సంబందించిన టన్నెల్ పనులు ఇతర పనులకు టెండర్లు పూర్తయ్యాయి.ఒకవైపు ఈ ప్రయత్నం చేస్తూనే మరోపక్కఏదుల రిజర్వాయర్ నుండి ఏ స్థాయి నుండి నీటిని తీసుకునే అంశానికి సంబందించి రెండు జిల్లాల నేతలతో ఎన్నోమార్లు ఫోన్లో మాట్లాడి ఒప్పించి ఇరు ప్రాంతాలకు నష్టం జరగకుండా ఏదుల వద్ద 437.35 ఎత్తు నుండి నీటిని తరలించేలా చేయడంతో రాజ్ గోపాల్ రెడ్డి గారి క్రుషి అంతా ఇంతా కాదు.ప్రపంచంలోనే అత్యంత ఫ్లోరైడ్ కలిగిన రక్కసితో మునుగోడు ప్రజల కోసం ఒక వైపు నీటిపారుదల ఉన్నతాదికారులతో మరో వైపు ఆయా శాఖల మంత్రులతో పాటు మహబూబ్ నగర్ జిల్లాకి చెందిన ప్రజాప్రతినిదులతో అనునిత్యం మాట్లాడుతూ మునుగోడు ప్రజలు పడుతున్న ఆవేదనను వాళ్లకి చెప్పి ఖచ్చితంగా మాకు 437.35 ఎత్తు నుండి నీటిని ఇవ్వాలని ఒప్పించేలా చేశారు.బీఆర్ఎస్ పార్టీ అదికారంలో ఉన్నపుడు కనీసం భూపరిహారం కోసం కేసీఆర్ దగ్గరికి వెళ్లి మట్లాడే దైర్యం చేయలేని మాజీ ఎమ్మెల్యే ఇపుడు ఉద్యమం చేసి ఏదుల వద్ద ఒప్పించాననడం హాస్యాస్పదంగా ఉంది.ప్రతిపక్షంలో ఉన్నపుడు తన రాజీనామాత మునుగోడు కు నిదుల వరద పారించాడు.అదికారంలో ఉండి మునుగోడుకు కావాల్సిన వనరులను తీసుకురావడంలో అహర్నిషలు శ్రమిస్తున్నారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు.

# పెద్ద కందుకూరు నూతన పిఏసిఎస్ డైరెక్టర్లకు ఘన సన్మానం

- **మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాళ్ళే లతా నర్సింహులు ఆధ్వర్యంలో సత్కారం**

**యాదగిరిగుట్ట, జూలై 21 ( వెలుతురు న్యూస్ )**

వంగపల్లి పిఏసిఎస్ కు యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామం నుండి నూతనంగా డైరెక్టర్లు ఎన్నికైన గుజ్జ బలరాం, జోగు ఐలయ్య తదితరులను కాంగ్రెస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కాళ్ళే లత నర్సింలు, పెద్ద కందుకూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాళ్ళే నర్సింలు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కాళ్ళే లత నర్సింలు, పెద్ద కందుకూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాళ్ళే నర్సింలు మాట్లాడుతూ తమ గ్రామానికి వంగపెల్లి పిఏసిఎస్ కు రెండు డైరెక్టర్ పదవులు ఇచ్చినందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. పెద్ద కందుకూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు రైతులకు అన్ని విధాలుగా సేవలు అందించేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా తమ పెద్ద కందుకూరు గ్రామానికి రెండు పీఏసీఎస్ డైరెక్టర్ పదవులు ఇచ్చిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా పెద్ద కందుకూరు గ్రామం నుండి వంగపల్లి పిఏ సిఎస్ కు డైరెక్టర్లుగా ఎన్నికైన గుజ్జ బలరాం, జోగు ఐలయ్యలను కాంగ్రెస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కాళ్ళే లత నర్సింలు, పెద్ద కందుకూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాళ్ళే నర్సింలు శాలువాలు, పూల



మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కందుకూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీసా మనోహర్ గౌడ్, సీస నగేష్ , జాగిల్లాపురం లక్ష్మయ్య, సందే సత్యనారాయణ , వట్టిపల్లి భరత్, గుర్రం మహేష్ , చాంద్ పాషా, కాళ్ళే మల్లేష్, రేగు సిద్ధులు , అరిగే సిద్ధులు, గుల్లపల్లి నగేష్, జమ్ము కొమరయ్య, జమ్ము పర్వతాలు, జోగు బసవయ్య గవ్వల కిష్టయ్య, గవ్వల శంకరయ్య, మిరియాల బిక్షపతి , మహిబెల్లి తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై బి ఎల్ ఏ లతో సమీక్ష సమావేశం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 21:**

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నకిరేకల్ నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ మువ్వా విజయ్ బాబు ఈ ఆర్ వో లెవల్ కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బి ఎల్ ఎ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త ఎంతో కష్టపడి పనిచేశారని అభినందించారు. చివరి దశకు చేరుకున్న ఈ ప్రక్రియను అదే నిబద్ధతతో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఏఐసీసీ



తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రతి ఓటు అత్యంత కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బి ఎల్ ఏ లు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలులో యాద్రి భువనగిరి జిల్లా మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. అలాగే ఓట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# కలెక్టర్ అనురాగ్ జయంతి కు పర్యావరణ ఉద్యమకారుల వినతి

- **జీడిమెట్ల రవీందర్ ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు**

**భువనగిరి వెలుతురు జూలై 21:**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, తోక్కాపూర్ గ్రామాల మధ్య సర్వే నెం. 119 & 139లోని సుమారు 50 ఎకరాల నారగుట్టలపై మైనింగ్ నిర్వహించేందుకు ఆర్కే స్టోన్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనలు వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ గారికి మెమో రండం ఇచ్చినా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గుట్టలు ప్రకృతి వారసత్వానికి, జీవవైవిధ్యానికి, భూగర్భ జలాల సంరక్షణకు, పక్షులు, జంతువుల ఆవాసాలకు ఎంతో కీలకమైనవనవని, ప్రతిపాదిత మైనింగ్ వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. రైతుల వ్యవసాయం, భూగర్భ



జలాలు, ప్రజారోగ్యం, పరిసర గ్రామాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ఈ నెల 28వ తేదీన ప్రతిపాదించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను తక్షణమే వాయిదా వేయాలని, పర్యావరణ ప్రభావ అంచనా (EIA) నివేదికను పూర్తి స్థాయిలో తెలుగులో ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ప్రభావిత గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి, బహిరంగ చర్చలు నిర్వహించిన తర్వాత మాత్రమే తదుపరి నిర్ణయం తీసుకోవాలని, స్వతంత్ర నిపుణులతో మైనింగ్ వల్ల కలిగే పర్యావరణ, భూగర్భ జలాలు, జీవవైవిధ్యం, ప్రజారోగ్యంపై ప్రభావాన్ని తిరిగి అధ్యయనం చేయించాలని, యాదాద్రి భువనగిరి ప్రజల అభ్యంతరాలు పూర్తిగా పరిశీలించే వరకు మైనింగ్ అనుమతులు మరియు సంబంధిత ప్రక్రియలను నిలిపివేయాలని,నారగుట్టలను జిల్లా ప్రకృతి వారసత్వ సంపదగా పరిరక్షించే చర్యలు చేపట్టాలని, ప్రజల భావాలను గౌరవించి, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కు ఇండియన్ ఎన్విరాన్‌మెంట్ సోషల్ ఫోరం (IESF) వ్యవస్థాపక అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్, పర్యావరణవేత్త శ్యామల నాగ సేన రెడ్డి , తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం ఎం సత్యనారాయణ యాదవ్. మంగళవారం వినతి పత్రం అందజేశారు.

# ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆగస్టు 17న జరిగే "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- **జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ పిలుపు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 21:**

గ్రామీణ వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆగస్టు 17న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాలు జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటపాక శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రామన్నపేట మండల కార్యాలయంలో జరిగిన ప్రజానాట్యమండలి మండల కమిటీ సమావేశంలో హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వృత్తి కళాకారులు అనేక ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కళాకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కళాకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆగస్టు 17న నిర్వహించనున్న "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న






వృత్తి కళాకారులు, ప్రజా కళాకారులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల నూతన అధ్యక్షుడిగా బర్రె మధు ను ఎన్నుకోగా ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి గంటెపాక శ్రీకృష్ణ, నకిరేకంటి సురేష్, మజ్జురి సాయి, మేడి పృధ్వి, మేడి వెంకన్న, కనుకుంట్ల ఉపేందర్, కొండగడప చరణ్, బూడిద ఆదిత్య, తుర్కపల్లి లోకేష్, జిట్ట రాజేష్ కమిటీ సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆనెగుంట సర్పంచ్‌కు డీపీఓ షోకాజ్ నోటీసు

**జహీరాబాద్ వెలుతురు జూలై 21:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం ఆనెగుంట గ్రామ సర్పంచ్ పొగాకు నరేష్ కుమార్‌కు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) షోకాజ్ నోటీసు జారీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జీపీడీపీ ప్రణాళిక కింద చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన రూ.7,73,604 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు విచారణలో తేలిందని నోటీసులో పేర్కొన్నారు.పనులు పూర్తయినప్పటికీ బిల్లుల చెల్లింపుల విషయంలో సర్పంచ్ తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ, ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోరాదో ఏడు రోజుల్లోగా డీపీఓ కార్యాలయంలో లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించారు.ఈ వ్యవహారంపై జహీరాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ జిల్లా కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలకు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# గ్రామసభ లేకుండానే జనరల్ అవార్డు పాస్ చేశారంటూ నిమ్జ్ రైతుల నిరసన

**జహీరాబాద్ వెలుతురు జూలై 21:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మామిడిగి గ్రామంలో నిమ్జ్ భూసేకరణ అంశంపై రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహించకుండా జనరల్ అవార్డు పాస్ చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెయ్యి ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేసి, అనంతరం 652 ఎకరాలకు మాత్రమే జనరల్ అవార్డు పాస్ చేయడంపై రైతులు అభ్యంతరం తెలిపారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతులు, తమ గ్రామ పరిధిలో సుమారు 703 ఎకరాల సారవంతమైన మూడు పంటలు పండే భూమి ఉందని పేర్కొన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ తమ సాగు భూములను నిమ్జ్‌కు ఇవ్వబోమని స్పష్టం చేస్తూ, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు.

# మున్సిపల్ వార్డుల్లో విస్తృత తనిఖీలు

- **సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 21:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ మహ్మద్ యూనుస్, కమిషనర్ జి. ప్రభాకర్ పట్టణంలోని పలు వార్డుల్లో రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్యం తదితర పౌర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు, మురుగు కాలువలు, పారిశుధ్య పరిస్థితిని సమీక్షించి, గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సెక్షన్ హెడ్‌లను ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు డ్రైనేజీల శుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, అవసరమైన చర్యలు ఆలస్యం లేకుండా అమలు చేయాలని ఆదేశించారు.

# వనమహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్ రాజ్‌కుమార్

- **పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 21:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ మండలం మనియర్‌పల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ బ్యాగారి రాజ్‌కుమార్ గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లు అధికంగా ఉంటేనే స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడి, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అన్నారు. విచక్షణారహితంగా వృక్షాలను నరికివేస్తే పర్యావరణ మార్పులతో నీటి కొరత ఏర్పడి రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని తెలిపారు. అందుకే పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం వనమహోత్సవాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొహమ్మద్ మహరుఫ్ అలీ, బ్యాగారి భాగప్ప, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు వేగవంతం చేయాలి

- **తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి...**

**హైదరాబాద్ వెలుతురు జూలై:**



ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తులు సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గడువుకు మరో పది రోజులే మిగిలి ఉన్నందున ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ఓటర్ల ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.సమావేశంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్ ముధిరాజ్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మెట్ట పంటలపై రైతులకు వ్యవసాయ అధికారుల అవగాహన

**గుండాల, జులై 21(వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు మెట్ట పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వానాకాలంలో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున, అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.2025 వానాకాలంతో పోలిస్తే ఇప్పటికే తక్కువ వర్షపాతం నమోదైందని, ఎల్ నినో ప్రభావంతో ఈ పరిస్థితి కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు వివరించారు.అలాగే ఆయిల్ పామ్, చిరుధాన్యాలు, కూరగాయల సాగు ద్వారా ప్రత్యామ్నాయ ఆదాయ అవకాశాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.కంది పంట సాగు చేసిన రైతుల కోసం గుండాలలోనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం అందుబాటులో ఉందని, పంట విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు మరిపడిగా గ్రామ సర్పంచ్ గూడెపూ కుమార్ ,వ్యవసాయ అధికారులు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- **కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్, హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ**

**కరీంనగర్ వెలుతురు జూలై 21:**




కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ మరియు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు సమాజంలోని ప్రతి శుభకార్యంలో కీలక పాత్ర పోషిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వృత్తిపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని మేయర్ హామీ ఇచ్చారు. అసోసియేషన్‌కు సొంత స్థలం ఉన్నట్లయితే మున్సిపల్ బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అలాగే అర్హులైన సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర ప్రయోజనాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమని, దీని ద్వారా అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, గౌరవ అతిథులు వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, సీతారెడ్డి, శ్రీకాంత్, నాగేష్, కౌశిక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన మహా గణేష్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులకు, కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు నగర మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# "సఫాయి అప్నావో – బీమారీ భగావో" పోస్టర్ ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- **జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్**
- **సీజనల్, అంటువ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత చర్యలు**

**కరీంనగర్ వెలుతురు జూలై 21:**



వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులను నివారించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సఫాయి అప్నావో – బీమారీ భగావో" ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మరియు పారిశుధ్య పర్యావరణ శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, నగరంలో రోజువారీ పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగాఅమలు చేసేందుకు ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో జీ.వి.పి. పాయింట్లు, మార్కెట్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తొలగించడం, చెత్తాచెదారం పూర్తిగా తొలగించడం, డ్రైనేజీల్లో పేరుకు పోయిన సిల్ట్‌ను శుభ్రం చేయడం, దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి చర్యలను విస్తృతంగా చేపడతామని తెలిపారు.కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ – ఎడ్యుకేషన్ – కమ్యూనికేషన్ (IEC) కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, వెల్ఫేర్ గ్రూపులు, హోటల్, రెస్టారెంట్, మార్కెట్ అసోసియేషన్‌లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నగర పరిశుభ్రత, సోర్స్ లెవల్ సెగ్రిగేషన్, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.నగరంలోని డ్రైనేజీలు, పెద్ద నాళాలు, కాలువలు, ఓపెన్ ప్లాట్లను పూర్తిగా శుభ్రపరచి వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువులు, కుంటల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.పారిశుధ్య కార్మికులకు వ్యర్థాల వేరు చేయడం, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సెగ్రిగేషన్, పీపీఈ కిట్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్లమ్ ప్రాంతాల్లో 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.పబ్లిక్, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వాటి మరమ్మతులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచుతామని, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.నగరంలోని పార్కులు, హెరిటేజ్ ప్రాంతాలు, స్ట్రీట్ ఫుడ్ జోన్‌లు, మార్కెట్ ప్రాంతాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు."నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జూలై 31 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలి. కరీంనగర్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీఈ లచ్చిరెడ్డి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ ఐ ఆర్)పై బీజేపీ రివ్యూ...

- **నగరంలోని 40 డివిజన్లలో జరిగిన ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ పై విస్తృతంగా సమీక్ష...**
- **సమీక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు...**

**కరీంనగర్ వెలుతురు జూలై 21:**






కరీంనగర్ నగరంలోని 40 డివిజన్లలో ఓటరు జాబితా ప్రక్షాళన , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మంగళవారం రోజున కీలక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్చార్జులు, జోన్ అధ్యక్షులు, పోలింగ్ బూత్ బాధ్యులు, బిఎల్ఎ 2లు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా నగర పరిధిలోని అన్ని డివిజన్లలో ఓటరు జాబితాలో ఓట్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో జరిగిన పరిశీలనను నాయకులు సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్క యువతీ యువకుడికి ఓటు హక్కు కల్పించే దిశగా బూత్ స్థాయి కార్యకర్తలు మరింత చురుగ్గా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా చూసే బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. "ప్రజాస్వామ్యంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.నగర అభివృద్ధిలోనూ, ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ ప్రతి ఓటూ కీలకమేనని , 40 డివిజన్లలో పార్టీ శ్రేణులు చేపట్టిన ఈ ప్రక్షాళన కార్యక్రమం విజయవంతంగా కొనసాగడం సంతోషకరమైన పరిణామని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, జోన్ అధ్యక్షులు , డివిజన్ బాధ్యులు, ప్రధాన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డివిజన్లలోని ఓటరు జాబితా స్థితిగతులను ఈ సందర్భంగా పార్టీ నాయకత్వానికి వివరించారు.

# 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో రూ. 19 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- **వికలాంగులకు అన్ని మౌలిక వసతులు, పారిశుధ్య సౌకర్యాలు కల్పిస్తాం – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 21:**





కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశల వారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం గారు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం గారు, మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా నిలబడి ఎల్‌నినోను ఎదుర్కొందాం

- రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం – అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 21:**

ఎల్–నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్–నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.
వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. పశువులకు పశుగ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని తెలిపారు. అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించడం, తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు మరియు సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. ఎల్–నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు అధికంగా ఉండటంతో, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి, వికాస్ రాజ్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, మనోహర్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, శాసన మండలి సభ్యులు దయానంద్, జిల్లా అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్‌ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిట్లర్ ని తలపించిన మోడీ,అమిత్ షా పాలనా

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి




**బషీర్ బాగ్ వెలుతురు 21జులై:**

విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం లాఠీలతో సమాధానం చెప్పిందని ఢిల్లీలో విద్యార్థులపై,నిరసనకారులపై పోలీసుల దాడి హిట్లర్ పాలనను తలపించిందని దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు,పేపర్ లీకేజీలపై బాధ్యత వహించి,కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన 'చలో సంసద్' నిరసన కార్యక్రమంలో విద్యార్థుల పట్ల,యువత మరియు ఇతర నిరసనకారుల పట్ల అత్యంత క్రూరంగా,దారుణంగా పోలీసులు లాఠీచార్జి చేయడం,బాష్పవాయువు ప్రయోగించడం మోడీ,అమిత్ షా ల అసమర్ధతకి నిదర్శనమని మండిపడ్డారు.ఢిల్లీ సంఘటనలో పోలీసులతో పాటు పోలీసుల ముసుగులో ఉన్న మతోన్మాద గుండాలు కూడా విద్యార్థులపై అత్యంత పాషావికంగా దాడి చేసి గాయపరిచారని మండిపడ్డారు.ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలియజేయడం,ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల ప్రజాస్వామిక హక్కు అని.విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం,వారి గొంతులను పోలీసు బలప్రయోగంతో అణచివేయడానికి ప్రయత్నించడం ఆందోళనకరమని.ముఖ్యంగా యువత భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల నిర్వహణలో పారదర్శకత,జవాబుదారీతనం ఉండాలన్నారు.ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై స్వతంత్ర,నిష్పాక్షిక విచారణ జరిపి,నిరసనకారులపై జరిగిన అనవసరమైన లేదా మితిమీరిన బలప్రయోగానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,గాయపడిన విద్యార్థులు మరియు ఇతర నిరసనకారులకు మెరుగైన వైద్య సహాయం అందించడంతో పాటు, అదుపులోకి తీసుకున్న వారిపై చట్టవిరుద్ధమైన చర్యలు జరగకుండా వారి హక్కులను పరిరక్షించాలని యువత గొంతును అణచివేయడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని,కేంద్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థి ప్రతినిధులతో తక్షణమే చర్చలు జరిపి,వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని,హిట్లర్ పాలనను తలపించిన అప్రజాస్వామిక ఢిల్లీ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలనీ ఆందోజు రవీంద్ర చారీ మరియు ముత్యాల యాదిరెడ్డి గార్లు డిమాండ్ చేశారు.

# గర్భిణీ అని తెలియగానే గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయాలి

- బస్తీ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన వైద్యాధికారులు , సిబ్బంది,మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం ఈరోజు కిమ్స్ సన్షైన్ హాస్పిటల్ బేగంపేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే,





ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారూ. ఓపి సేవలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్స్, సూపర్ వైజరీ సిబ్బంది తప్పకుండా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షణ చేసి ఫీల్డ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ మన ఆరోగ్య కార్యక్రమాల ఇండికేటర్స్ సకాలంలో పూర్తయ్యేటట్టు, చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, ఇబ్బంది అలసత్వము వహించకూడదు అని కోరారు.

HMIS మరియు MCH పోర్టల్ లో ప్రతిరోజు సమాచారను నమోదు చేయాలి.

అన్ని ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలలో వెనుకబడి ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగు పడాలని సూచించారు.ఈ సమావేశంలో డా : చల్లా దేవి జిల్లా టీబి అధికారి ,అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , అడిషనల్ డిఎంహెచ్‌ఓ (ఎయిడ్స్ &, లెప్రసీ) డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా: శ్రీధర్, డా:సాయిబాబా , శ్రీ కళా , ఆశ్రిత రెడ్డి , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు,పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.

# అంబర్ పేట్ తిలక్ నగర్ చౌరస్తాలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు


**బషీర్ బాగ్ వెలుతురు 21 జులై :**




ఈ సందర్భంగా సిపిఎం పార్టీ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ కు సంబంధించి కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ ఢిల్లీలో CJP, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయి. సోనం వాంగ్ చుక్ ను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో దీక్ష కొనసాగిస్తున్నారు. CJP వ్యవస్థాపకుడు దుప్కే నిరాహార దీక్ష మద్దతు తెలియజేస్తూ. 22 లక్షల మంది విద్యార్థులు రాసిన నీట్ పేపర్ లీక్ కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలి లని డిమాండ్ తెలంగాణ నుండి ఎన్నికైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ లు నీట్ పేపర్ లీక్ కారణంగా అనేకమంది విద్యార్థులు మృతి చెందారు దీనికి సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా కేంద్రం బిజెపి ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ అందించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటం చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యురాలు వై వరలక్ష్మి , సుబ్బారావు, షబానా, ఏసు, రాయిస్, జెమిస్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థి శ్రేయ ఆత్మహత్యకు కారణమైన వాసవి ఇంజనీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రేయ మరణానికి కారణమైన వాసవి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలేజీ వాళ్ళ యొక్క వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రెండు పేజీల లేఖలు రాసి మరి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం. గత సంవత్సరం జరిగిన సంఘటనకు మళ్లీ ఈ సంవత్సరం అదే సంఘటనను గుర్తు చేస్తూ గత మూడు నెలలుగా వేధిస్తూ అవమానించడం వల్లే ఆ యొక్క విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని దీనికి కళాశాల అధ్యాపకులు యాజమాన్యం కారణమని వీరిని కఠినంగా శిక్షించాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

# దిల్‌శుక్‌నగర్‌లో నవాబ్ హోటల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

**ఎల్‌బీ నగర్, వెలుతురు జులై 21:**

దిల్‌శుక్‌నగర్‌లో ప్రముఖ నవాబ్ హోటల్ నూతన బ్రాంచ్‌ను ఓనర్లు సయ్యద్ మొహియుద్దీన్, సయ్యద్ అయ్మాన్, సయ్యద్ హర్వాన్ ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, ఆహార ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందుబాటు ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ ప్రత్యేక బిర్యానీతో పాటు వివిధ రకాల నాన్‌వెజ్, తందూరీ, ఫ్యామిలీ స్పెషల్ వంటకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో హోటల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



# ఎల్‌ఐసీ ఏజెంట్లకు స్వంత భవనం కోసం ప్రభుత్వ స్థలం కేటాయింపునకు కృషి చేస్తా – టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**లియాఫీ –1964 సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహణ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ –1964) సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణలోని పాత జిల్లాలైన నిజామాబాద్, మెదక్, సికింద్రాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన 23 బ్రాంచ్‌లు, 14 శాటిలైట్ బ్రాంచ్‌ల నుంచి సుమారు 1,200 మంది జీవిత బీమా ఏజెంట్లు, నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు.సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది అయిన భారతీయ జీవిత బీమా సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అమూల్యమని కొనియాడారు. సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్‌కు స్వంత కార్యాలయ భవనం నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ బీమా సంస్థలు వచ్చినప్పటికీ ప్రజల విశ్వాసం ఇప్పటికీ




ఎల్‌ఐసీపైనే ఉందని పేర్కొన్నారు. జాతీయ నాయకులు కౌటికె విఠల్ తన సహాధ్యాయుడని, ఆయన ఆహ్వానం మేరకే ఈ సమావేశానికి హాజరైనట్లు ఆయన తెలిపారు.అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసాచారి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సికింద్రాబాద్ డివిజన్ యూనియన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి ఏజెంట్ల ఐక్యత దేశానికి ఆదర్శమని, భారతీయ జీవిత బీమా సంస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో ఏజెంట్లు మరింత సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.భారతదేశ నంబర్–1 చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్, లియాఫీ జాతీయ నాయకుడు కౌటికె విఠల్ మాట్లాడుతూ, ఏజెంట్లకు నిరంతర శిక్షణ, వృత్తిపరమైన విద్య, చట్టపరమైన రక్షణ అత్యవసరమన్నారు. ఏజెంట్ల కమిషన్ పరిరక్షణ కోసం లియాఫీ –1964 మరింత బలంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతి కొత్త పాలసీ పథకంలో కమిషన్ శాతం తగ్గించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. అలాగే సికింద్రాబాద్ డివిజన్‌కు స్వంత భవనం నిర్మాణానికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.మూడేళ్లకోసారి జరిగే ఈ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మెదక్ జిల్లా సిద్ధిపేట బ్రాంచ్‌కు చెందిన రామస్వామి ప్రధాన కార్యదర్శిగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ బ్రాంచ్‌కు చెందిన గోవింద్ రెడ్డి, కోశాధికారిగా నిజామాబాద్ జిల్లా కామారెడ్డి బ్రాంచ్‌కు చెందిన భాస్కర్ ఎన్నికయ్యారు. సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి పదవీ బాధ్యతలు అప్పగించారు.ఈ సమావేశంలో లియాఫీ –1964 అఖిల భారత కోశాధికారి శ్రీరామ్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, LIC సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహూ, మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాద్ రావు, CLIA విభాగం అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ ప్రభాకర్, జాతీయ, జోనల్, డివిజనల్ నాయకులు, వివిధ బ్రాంచ్‌లకు చెందిన ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఓటరు నమోదు ఫారాల సహాయ కేంద్రం

**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని బూత్ నంబర్–42లో ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల (Enumeration Forms) కోసం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని నిర్వహించారు.ఈ కేంద్రానికి వచ్చిన ఓటర్ల నుంచి ఫారాలను స్వీకరించి, వాటిని సక్రమంగా నింపించి, సంబంధిత బీఎల్‌ఓ (BLO)కు అందజేశారు. అలాగే ఫారాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, జాకీ, జైస్వాల్, రాజేందర్ గౌడ్, శేఖర్‌తో పాటు బీఎల్‌ఓ మునుస్వామి పాల్గొన్నారు.ఈ సహాయ కేంద్రం ద్వారా ఒక్క రోజులోనే సుమారు 100 ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి విజయవంతం..





- **ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత ఇవ్వాలి**

**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) ముఖాముఖి షెడ్యూల్‌లో భాగంగా నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద వైద్యులు (Doctors JAC), న్యాయవాదులు (Advocate JAC), మరియు విలేఖరులు (Journalists JAC) సమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది.ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, శ్రీ అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీ మోతె శోభన్ రెడ్డి, శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు:

**శ్రీ అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు)**
**శ్రీ ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్)**
**శ్రీ ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్)**

టిఆర్ఎస్ (TRS) అధినేత్రి కల్వకుంట్ల కవిత మద్దతు — కేంద్ర ప్రభుత్వ జీవోల సమర్పణ:

ఈ సమావేశానికి తెలంగాణ రక్షణ సేన (TRS) పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల (GOs) ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. "నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జీగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం" అని తెలిపారు.

**వివిధ రంగాలు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లు:**

1. జర్నలిస్ట్ ఉద్యమకారుల డిమాండ్లు:

తెలంగాణ మీడియా రక్షణ:

తెలంగాణ మీడియా చానల్స్ మరియు పత్రికల రక్షణ కొరకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు (Separate Funds) కేటాయించాలి.

జర్నలిస్టులకు గుర్తింపు:

250 గజాల నివాస స్థలం, ఉచిత రవాణా సౌకర్యం, పిల్లలకు ఉచిత నాణ్యమైన విద్య.

ప్రత్యేక ఆసుపత్రి:

జర్నలిస్టుల కుటుంబ ఆరోగ్య రక్షణ కొరకు ప్రత్యేక హాస్పిటల్ సదుపాయం కల్పించాలి.

1. అడ్వకేట్ జేఏసీ (Advocate JAC) డిమాండ్లు:

అడ్వకేట్ ఎమ్మెల్సీ (Advocate MLC):

న్యాయవాద వ్యవస్థ మరియు ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కోసం శాసనమండలిలో అడ్వకేట్లకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానాన్ని ఏర్పాటు చేయాలి.

1. డాక్టర్స్ జేఏసీ (Doctors JAC) డిమాండ్లు:

డాక్టర్ల ఎమ్మెల్సీ & బదిలీల్లో పాయింట్లు:

శాసనమండలిలో డాక్టర్లకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానం ఏర్పాటు చేయాలి. ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్లకు ప్రభుత్వ బదిలీల్లో (Transfers) ప్రత్యేక ప్రాధాన్యత పాయింట్లు ఇవ్వాలి.

గుర్తింపు కార్డులు & ఆయుష్ ఆసుపత్రులు:

ఉద్యమకారులైన డాక్టర్లకు అధికారిక ఐడీ కార్డులు జారీ చేయాలి. 'ఆరోగ్య తెలంగాణ' సాధనకు ఆయుష్ (AYUSH) ఆసుపత్రుల సంఖ్యను పెంచాలి.

**1. కార్పొరేషన్ & కాలపరిమితి డిమాండ్:**

శాశ్వత కార్పొరేషన్ (Permanent Corporation):

ఉద్యమకారుల సంక్షేమం కోసం ఒక పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**ఈ ప్రక్రియ మొత్తానికి ఒక నిర్దిష్ట కాలపరిమితి (Time Limit) నివేదించాలి. కమిటీ భరోసా:**

కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీ అసమర్థ పాలనపై పోరాడుతున్న యువతపై లాఠీచార్జ్... ఇదేనా మోదీ గారి అచ్చే దిన్..? మంత్రి ఇందిరమ్మ ఇండ్ల శీనన్న



**హైదరాబాద్ వెలుతురు జూలై 21:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనపై, పేపర్ లీకులపై శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై కాషాయ కసాయి పాలకులు చేసిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాను.భావి భారతాన్ని తీర్చిదిద్దే యువతపై లాఠీలు ప్రయోగించడం మోదీ ప్రభుత్వ అహంకారానికి, నియంతృత్వ ధోరణికి నిదర్శనం. పేపర్ లీకులతో విసిగిపోయి, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను శత్రువుల్లా చూస్తూ, బూటుకాళ్ల కింద తొక్కిపడేయడమేనా మీ 'అచ్చే దిన్'? విద్యార్థులపై పడ్డ ప్రతి లాఠీ దెబ్బకు, చిందిన ప్రతి రక్తపు బొట్టుకూ బీజేపీ పార్టీ ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదు.తమ న్యాయమైన హక్కుల కోసం, భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. యువత పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది.

# నిత్యం యోగ సాధన చేయాలి






- **మైసూర్ యోగశాల వ్యవస్థాపకులు రమేష్ శెట్టి**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూలై 21:**

పతంజలి మహర్షి ప్రవేశపెట్టిన యోగ సాధన తో మానసిక ప్రశాంతత, శారీరక వికాసం, మోక్షం లభిస్తాయని మైసూర్ యోగశాల వ్యవస్థాపకులు అంతర్జాతీయ యోగశిక్షకులు రమేష్ శెట్టి తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండలోని అరబిందో ఆశ్రమం బ్రీత్ మౌంటెన్ రీ ట్రీట్ సెంటర్లో నిర్వహించిన ఐదు రోజుల యోగా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి ధృవపత్రాలను అందజేశారు. ప్రశాంతమైన ప్రకృతిలో నిర్వహించిన ఈ యోగా శిబిరం సాధకులకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తాను 58 దేశాలు పర్యటించి 11 వేల మందికి పతంజలి యోగాలో శిక్షణనిచ్చినట్టు వెల్లడించారు. అరబిందో ఆశ్రమం వ్యవస్థాపకులు అరవింద్ రెడ్డి మాట్లాడుతూ, అరవింద మహర్షి మార్గంలో పయనిస్తూ ఈ ఆశ్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇక్కడ యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక, ప్రకృతికి మనిషిని దగ్గర చేసే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యోగా శిక్షకులు అక్షయ, నిష్కల్, వర్షిని, సౌండ్ హీలింగ్ నిపుణుడు సురక్షిత్ రెడ్డి, బ్రీత్ సెంటర్ మేనేజర్ సలాం పాల్గొన్నారు.

# అక్రమ "మహిళా బిల్లు" ముసుగులోని డీలిమిటేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- **న్యూఢిల్లీలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ మహాధర్నాను అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం**
- **రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్**

**ఢిల్లీ వెలుతురు జూలై 21:**



అక్రమ మహిళా బిల్లుకు వ్యతిరేకంగా న్యూఢిల్లీ కేంద్రంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను అక్రమంగా అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం మరియు ఢిల్లీ పోలీసుల చర్యలను రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షురాలు ★శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ★శ్రీమతి ఎర్రవెల్లి స్వర్ణ★ గారి నేతృత్వంలో, వారి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ మహాధర్నాలో తెలంగాణ రాష్ట్రం నలుమూల నుండి దాదాపు ★300 మంది మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ, "గతంలో ప్రజలు తిరస్కరించిన, పార్లమెంట్ లో ఓడిపోయిన అక్రమ డి లిమిటేషన్ బిల్లును ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు' అనే ముసుగులో తిరిగి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ కుటిల నీతికి నిదర్శనం. మహిళల పేరు చెప్పి మోసం చేస్తున్నారు" అని ఆరోపించారు.శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చిన మహిళలను ఢిల్లీ పోలీసులు అక్రమంగా అడ్డుకోవడం, నిర్బంధించడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. మహిళల గొంతు నొక్కే కేంద్ర ప్రభుత్వ ధోరణి సిగ్గుచేటు అని విమర్శించారు. "ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ పోరాటం కాదు. ఇది దేశంలోని ప్రతి మహిళ, ప్రతి పౌరుడి హక్కుల కోసం జరిగే పోరాటం. కాబట్టి తెలంగాణ మహిళా కాంగ్రెస్ చేపట్టిన ఈ పోరాటానికి యావత్ భారత ప్రజానీకం మద్దతు తెలపాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అక్రమ బిల్లును ఉపసంహరించుకోవాలని" శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ పత్రికా ముఖంగా డిమాండ్ చేశారు.మహిళలకు నిజమైన రిజర్వేషన్లు ఇవ్వకుండా, కేవలం ఎన్నికల రాజకీయాల కోసం బిల్లుల పేరుతో మోసం చేస్తే సహించబోమని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

# విద్యార్థి నాయకుడు యంగలి గోపి గౌడ్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ



**కేతేపల్లి వెలుతురు జూలై 21:**

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన విద్యార్థి నాయకుడు యంగలి గోపి గౌడ్ తన జన్మదినం, తాను చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థిగా విద్యార్థులందరికీ నోటుబుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచకొండ నాగమ్మ అంజయ్య మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థిగా తాను విద్యను అభ్యసించిన పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం ద్వారా యంగలి గోపి గౌడ్ సామాజిక బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించడంతో పాటు, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచకొండ నాగమ్మ అంజయ్య, మాజీ ఎంపీపీ రాచకొండ యాదగిరి గౌడ్ , గ్రామ ఉపసర్పంచ్ చిత్తలూరి జానయ్య గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ గుండగోని శేషు గౌడ్, సీనియర్ నాయకులు బాలయ్య గారు, గౌడ విద్యార్థి సంఘం సెక్రటరీ అభిరామ్ గౌడ్, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులు యంగలి గోపి గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# గురుకులాల తనిఖీలకు డెడ్‌లైన్

- **మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన ఆదేశాలు**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మహాత్మా జ్యోతిబా పూలే బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థలను ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం యొక్క ప్రథమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. బిసి గురుకులాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థుల సంక్షేమంపై రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు (ఆర్సీవోలు), ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో మంత్రి ఈ మేరకు మాట్లాడారు.గురుకుల విద్యాసంస్థల రోజువారీ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. అందులో భాగంగా ప్రతి రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్‌సీవో) వారానికి కనీసం మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రతి వారమూ కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను స్వయంగా సందర్శించి పరిశీలించాలని ఆదేశించారు. ఆర్‌సీవోలు కేవలం కార్యాలయ పర్యవేక్షణకే పరిమితం కాకూడదని, ప్రధాన కార్యాలయానికి, జిల్లా యంత్రాంగానికి మరియు పాఠశాలల నిర్వహణకు మధ్య ఒక బలమైన సంధానకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల విద్యాసంస్థలకు వెంటనే భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దీనికోసం ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై అవసరమైన స్థలాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాల అదే నియోజకవర్గ పరిధిలోనే కొనసాగేలా, అక్కడ సొంత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇక అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించే మొత్తం అద్దెలో కనీసం 6 శాతం నిధులను ఆయా భవనాల మరమ్మతులు, పారిశుధ్య పనుల కోసం తప్పనిసరిగా కేటాయించాలని ఆదేశించారు.ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ఏ గురుకులంలోనూ ఆహారం వికటించి (ఫుడ్ పాయిజనింగ్) విద్యార్థులు అస్వస్థతకు గురయ్యే ఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి హెచ్చరించారు. వంటశాలల పరిశుభ్రత, మెస్ నిబంధనలు, నిత్యావసరాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యంతో ఉండటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు నిపుణులైన సైకాలజిస్టులతో పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు.పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, వారి చేత పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని, ఆ నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులకే అప్పగించి వారిలో బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించాలని సూచించారు. భవనాల మరమ్మతుల నిధులను సకాలంలో ఉపయోగిస్తూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.గురుకులాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు ప్రతి నెల కనీసం 15 గురుకుల విద్యాసంస్థలను తాను స్వయంగా, అలాగే శాఖ కమిషనర్, కార్యదర్శి కలిసి అకస్మిక తనిఖీలు (సర్ ప్రైజ్ విజిట్స్) చేస్తామని మంత్రి ప్రకటించారు. విద్యార్థుల వసతి, భోజనం, విద్యా ప్రమాణాల విషయంలో అధికారులు లేదా




ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలపై తక్షణమే స్పందించి పరిష్కరించేలా ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు.విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా క్రీడలు, లలిత కళలు, నాటకం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లోనూ ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని మంత్రి కోరారు. క్రీడలు, ఇతర రంగాల్లో విశేష ప్రతిభ చూపించే విద్యార్థుల వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపితే, వారికి ప్రభుత్వం తరపున మరింత ఆర్థిక, నైతిక ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఇదే సమయంలో మూసీ గురుకుల విద్యాసంస్థకు త్వరలోనే సొంత భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు.ఈ ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, కార్యదర్శి బడుగు సైదులు, విభాగాధిపతులు, డిప్యూటీ సెక్రటరీలు మరియు వివిధ జిల్లాల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు (ఆర్సీవోలు) ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకుని, అట్టడుగు స్థాయి విద్యార్థులకు సంక్షేమ ఫలితాలు అందేలా నిరంతరం కృషి చేయాలని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు.

# మహిళల సహనానికి హద్దులు ఉన్నాయి, మహిళా రిజర్వేషన్ అమలు చేసే సమయం ఆసన్నమైంది.

- **పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించామని చెప్పి, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దాని అమలును నిరవధికంగా వాయిదా వేయడం మహిళల హక్కులను కాలరాయడమే.**
- **ప్రాతినిధ్యాన్ని వాయిదా వేయడం అంటే మహిళల హక్కులను నిరాకరించడమే.**
- **డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 21:**




మంగళవారం రోజున అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అల్కా లాంబా గారి నాయకత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశం నలుమూలల నుంచి వచ్చిన మహిళలు ఒకే నినాదంతో ఉద్యమిస్తున్నారు.

**"ఆజ్ కరో – అబ్ హీ కరో!"**

తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గారి నాయకత్వంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ కూడా ఈ జాతీయ ఉద్యమంలో పాల్గొని, మహిళలకు ఇప్పటికే హామీ ఇచ్చిన రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

ఇక సాకులు వద్దు... ఇక జాప్యం వద్దు...
మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయండి!

# హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయండి

- ప్రతి నెలా పురోగతిని నేనే సమీక్షిస్తా.. అవసరమైతే సైట్‌లోనే బస చేస్తా: సీఎం రేవంత్ రెడ్డి
- వికారాబాద్ జిల్లా హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి
- నిర్మాణ పనులు మందకొడిగా సాగడంపై అధికారులపై తీవ్ర అసంతృప్తి
- ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియో థెరపీ కళాశాలల పనులపై సమీక్ష
- ప్రతి ప్రాజెక్టు పురోగతిని ఇకపై నెలనెలా తనిఖీ చేస్తానని స్పష్టం
- అవసరమైతే నెలలో ఒక రోజు నిర్మాణ ప్రాంతంలోనే బస చేస్తానన్న సీఎం
- పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సస్పెన్షన్లకు వెనుకాడొద్దని ఉన్నతాధికారులకు ఆదేశం
- ఎడ్యుకేషన్ హబ్‌ను రాష్ట్రంలో అత్యుత్తమ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన



హకీంపేటలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇకపై ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే నెలలో ఒక రోజు నిర్మాణ ప్రాంతంలోనే బస చేసి పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు.ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్మిస్తున్న ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కళాశాలలు, హాస్టళ్ల నిర్మాణాలను పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెండ్ చేయడానికీ వెనుకాడొద్దని ఉన్నతాధికారులను ఆదేశించారు.భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎడ్యుకేషన్ హబ్ అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

# భర్త ఉద్యోగానికి భంగం కలిగించొద్దు


- భర్త పనిచేసే కంపెనీలో ఫిర్యాదు చేయొద్దు
- దాంపత్య కలహాల్లో ఉద్యోగాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు
- ఉద్యోగం కోల్పోతే భరణంపైనా ప్రభావం పడొచ్చని ఆందోళన
- మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవాలని సూచన
- పరువునష్టం కేసు బదిలీ పిటిషన్ విచారణలో కీలక వ్యాఖ్యలు



దాంపత్య వివాదాల నేపథ్యంలో భర్త పనిచేస్తున్న సంస్థకు లేదా యజమానికి భార్య ఫిర్యాదు చేయడం సరైన పద్ధతి కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అలాంటి చర్యల వల్ల భర్త ఉద్యోగ భద్రత దెబ్బతినే అవకాశం ఉందని, దాని ప్రభావం భవిష్యత్తులో భార్య కోరే భరణంపైనా పడవచ్చని ధర్మాసనం వ్యాఖ్యానించింది.అస్సాంలో నమోదైన పరువునష్టం కేసును ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన బదిలీ పిటిషన్‌ను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.విచారణ సందర్భంగా మహిళ తరఫు న్యాయవాది, తన క్లయింట్‌కు భర్తతో పలు న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయని కోర్టుకు తెలిపారు. అదే సమయంలో భర్త స్నేహితుడు అస్సాంలో ఆమెపై పరువునష్టం కేసు దాఖలు చేశాడని పేర్కొంటూ, విచారణ సౌలభ్యం కోసం ఆ కేసును గాజియాబాద్‌కు బదిలీ చేయాలని కోరారు.ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో దాంపత్య కలహాల కారణంగా భర్తల యజమానులు లేదా వారు పనిచేస్తున్న సంస్థలకు ఫిర్యాదులు చేసే ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. అలాంటి ఫిర్యాదుల వల్ల ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఏర్పడితే అది కుటుంబ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో మహిళ ఢిల్లీలోని భారత వైమానిక దళ అధికారులకు ఫిర్యాదు చేస్తూ, తన భర్త ఎయిర్‌ఫోర్స్ అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలోనే పరువునష్టం కేసు నమోదైనట్లు కోర్టులో వివరాలు వెల్లడయ్యాయి.

# నలుగురు భారతీయుల మృతిపై

- రష్యాకు భారత్ తీవ్ర నిరసన
- రష్యా దౌత్య ప్రతినిధికి సమన్లు జారీ
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- వాణిజ్య నౌకలపై దాడులు అంగీకారయోగ్యం కాదని స్పష్టం
- మరో భారతీయ నావికుడి పరిస్థితి విషమం



రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో జరిగిన దాడిలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషాద ఘటనకు సంబంధించి న్యూఢిల్లీలోని రష్యా రాయబార కార్యాలయ ఛార్జ్ డి అఫైర్స్‌కు కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేసింది.ఈ సందర్భంగా పౌర వాణిజ్య నౌకపై జరిగిన దాడిపై భారత్ తన తీవ్ర నిరసనను అధికారికంగా తెలియజేసింది. ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని రష్యాను డిమాండ్ చేసింది. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది.దాడిలో గాయపడిన మరో భారతీయ నావికుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. అతను ప్రస్తుతం తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు.రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారతీయ సముద్రయాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన తొలి ఘటన ఇదే కావడం గమనార్హం. ఈ పరిణామాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ, భారతీయుల భద్రతకు సంబంధించిన అంశాలపై రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# సిక్కింలో ఘోర ప్రమాదం..

- టన్నెల్‌లో చిక్కుకుని ఎనిమిది మంది మృతి
- కొండచరియలు విరిగిపడి టన్నెల్ ప్రవేశమార్గం మూసివేత
- మీథేన్ గ్యాస్ లీక్‌తో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- లోపల చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు



సిక్కింలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నామ్చి జిల్లాలోని సమర్‌డంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న టన్నెల్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో టన్నెల్ ప్రవేశమార్గం పూర్తిగా మూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు టన్నెల్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించాయి. అయితే, కొండచరియలు విరిగిపడిన తర్వాత భూగర్భం నుంచి మీథేన్ గ్యాస్ వెలువడుతుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. టన్నెల్‌లోకి వెళ్లిన సహాయ సిబ్బంది గ్యాస్ ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, కొందరు స్పృహ కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ప్రత్యేక పరికరాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న అధికారులు, సహాయక సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే రక్షణ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు.

కొండచరియలు భారీగా విరిగిపడటంతో భూగర్భ పొరల్లోని మీథేన్ వాయువు సహజంగానే వెలువడుతోందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, టన్నెల్‌లో ఇంకా ఎంతమంది చిక్కుకుపోయారనే విషయంపై అధికారిక సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు.

# ఢిల్లీలో అగ్నిప్రమాదం..

- మహిళతో పాటు ఇద్దరు చిన్నారుల మృతి
- బీకేదత్ కాలనీలో విషాద ఘటన
- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కోణంలో దర్యాప్తు
- ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు



దేశ రాజధాని ఢిల్లీలోని బీకేదత్ కాలనీలో మంగళవారం విషాదకర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ నివాస గృహంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో చిక్కుకున్న మహిళతో పాటు ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా వ్యాపించిన మంటలను అదుపులోకి తెచ్చిన అనంతరం ఇంట్లో చిక్కుకున్న ముగ్గురిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా లేదా మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో మరెవరైనా ఉన్నారా అనే అంశాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.ఈ ఘటనతో బీకేదత్ కాలనీలో విషాద వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులను స్థానికులు పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అధికారులు వెల్లడించే అవకాశం ఉంది.

# ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

- తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు
- రాజ్యసభలోని కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ
- పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీలు
- పార్టీ బలోపేతానికి ఖర్గే నాయకత్వం కీలకమని ప్రశంసలు
- తెలంగాణ రాజకీయాలపై కూడా స్వల్పంగా చర్చించినట్లు సమాచారం





**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 21:** ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభలోని కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఎంపీలు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దేశ రాజకీయాల్లో ఖర్గే పోషిస్తున్న పాత్రను ఎంపీలు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం కీలకంగా ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన చేస్తున్న పోరాటాన్ని అభినందించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సందర్భంగా స్వల్పంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన చర్యలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.ఖర్గేకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఎంపీలు శుభాభినందనలు తెలిపారు. ప్రజా సేవలో ఆయన మరింత కాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ భేటీలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు పాల్గొని ఏఐసీసీ అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశం అనంతరం ఖర్గేతో కలిసి ఎంపీలు జ్ఞాపకార్థం ఫొటోలు దిగారు. ఖర్గేను కలిసిన వారిలో మల్లురవి, వేం నరేందర్ రెడ్డి, చామలకిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వర్షాలు కురవాలని చిలుకూరు బాలాజీ

- ఆలయ అర్చకుల వరుణ పూజలు
- ఉస్మాన్‌సాగర్‌లో వరుణ జపం.. ప్రత్యేక వైదిక పూజలు
- చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అనుష్ఠానం
- వర్షాభావం తొలగి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు
- 108 సార్లు వరుణ మంత్రాల పారాయణం

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు ప్రత్యేక వరుణ జపాన్ని నిర్వహించారు. గండిపేట ఉస్మాన్‌సాగర్ జలాశయం వద్ద వైదిక సంప్రదాయాల ప్రకారం ఈ పూజా కార్యక్రమాన్ని చేపట్టారు.ఆలయ ప్రధాన అర్చకుడు సి.ఎస్. రంగరాజన్ నేతృత్వంలో అర్చక బృందం కలశంతో జలాశయ తీరానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. వర్షాభావ పరిస్థితులు తొలగి ప్రకృతి అనుకూలంగా మారాలని, రైతులు మంచి పంటలు పండించాలని, ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండాలని ప్రార్థనలు చేశారు.వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకులు 108 సార్లు వరుణ జప మంత్రాలను పారాయణం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రంలో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక హోమాలు, వైదిక క్రతువులు నిర్వహించారు.ఇదిలా ఉండగా, చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.





# విద్యార్థులపై అమానుషంగా దాడులు చేస్తారా?

- **పార్లమెంట్‌లో అత్యవసర చర్చ కోరిన ఇండియా కూటమి ఎంపీలు**
- **పోలీసు చర్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్**

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**

ఢిల్లీలో నిర్వహించిన సీజేపీ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడాన్ని ప్రశ్నిస్తూ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని క్షమాపణ చెప్పాలని, ఇలాంటి చర్యలు వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు.పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలు ఆందోళనకరమని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరీక్షల వ్యవస్థలో నెలకొన్న సంక్షోభంపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ అంశంపై సభలో అత్యవసర చర్చ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై పార్లమెంట్‌లో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు.ఇదిలా ఉండగా, పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంలో గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్న ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) ఆసుపత్రికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వెళ్లి వారిని పరామర్శించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

# సింధూ జలాల ఒప్పందం యథాతథంగా అమలు కుదరదు

- **పాక్ తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ప్రభుత్వ వర్గాలు**
- **జల విద్యుత్ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ఒప్పందాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణ**

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**

సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలో మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భవిష్యత్తులో ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వచ్చినా ప్రస్తుత నిబంధనలతో కాకుండా, మార్పులు చేర్పులతోనే అమలు చేసే అవకాశముందని స్పష్టం చేశాయి. అంతేకాదు, పాకిస్థాన్ ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి పలికిన తర్వాతే ఈ అంశంపై ముందడుగు పడుతుందని పేర్కొన్నాయి. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది.గతేడాది పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరు దశాబ్దాలకు పైగా అమల్లో ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. అయితే, ప్రస్తుతం ఆ ఒప్పందం నుంచి పూర్తిగా వైదొలగాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని భావిస్తే, దానిని సవరించే లేదా రద్దు చేసే హక్కు సార్వభౌమ దేశమైన భారత్‌కు ఉందని పేర్కొన్నాయి.

సింధూ జలాల ఒప్పంద భవిష్యత్తు పూర్తిగా పాకిస్థాన్ వైఖరిపైనే ఆధారపడి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగిస్తూ, మరోవైపు ఒప్పందాన్ని పునరుద్ధరించాలని కోరడం సమంజసం కాదని అభిప్రాయపడింది. భారత్ ఒప్పందాన్ని నిలిపివేసిన తర్వాత పాకిస్థాన్ నీటి కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ వివిధ ఆరోపణలు చేస్తోంది. అయితే, నీటి సమస్యకు భారత్ కారణం కాదని, తగిన నిల్వ సామర్థ్యాలు అభివృద్ధి చేసుకోకపోవడం వల్లే పాక్ ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.భారత్ పలుమార్లు ఉగ్రవాదంపై ఆందోళనలు వ్యక్తం చేసినప్పటికీ, పాకిస్థాన్ నుంచి ఎలాంటి అర్థవంతమైన చర్యలు కనిపించలేదని అధికారులు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న ఉగ్రవాదులు ఇప్పటికీ పాకిస్థాన్‌లో బహిరంగంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని విమర్శించారు.ఇదిలా ఉండగా, జీలం, చినాబ్ వంటి పశ్చిమ నదులపై జమ్మూకశ్మీర్‌లో భారత్ నిర్మిస్తున్న జల విద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఒప్పందంలోని వివాద పరిష్కార నిబంధనలను అడ్డంకిగా ఉపయోగించి ఈ ప్రాజెక్టులను ఆలస్యం చేయాలని ప్రయత్నిస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి.కాగా, సింధు నది, దాని ఉపనదుల జలాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య 1960లో సింధూ జలాల ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం మారిన భద్రతా పరిస్థితులు, సరిహద్దు ఉగ్రవాదం నేపథ్యంలో ఈ ఒప్పందంపై భారత్ తన వైఖరిని మరింత కఠినతరం చేసినట్లు తెలుస్తోంది.

# కొడంగల్ అభివృద్ధి పనుల్లో

**(మొదటి పేజీ తరువాయి)**

కొడంగల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలతోపాటు బస్ స్టేషన్స్ నిర్మాణం, చెరువుల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు

**హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన**

హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అధికారులపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దని ఆదేశించారు. హబ్ కు భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై అధికారులపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.

ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్స్, వెటర్నరీ కళాశాల, ప్రభుత్వ మెడికల్, నర్సింగ్, ఫిజియో థెరపీ& పారా మెడికల్ కళాశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఇకనుంచి ప్రతీ నెలా పనుల పురోగతిపై పరిశీలిస్తానని... ప్రతీ నెల ఒక రోజు సైట్ లోనే బస చేస్తానని అధికారులకు తెలిపారు. ఆగస్టు 30 న మళ్లీ వస్తానని, ఎడ్యుకేషన్ హబ్ లోనే సమీక్ష నిర్వహించి అక్కడే బస చేస్తానని సీఎం తెలిపారు. పర్యటనలో సీఎంతో పాటు ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ మార్చ్‌తో శంభు సరిహద్దులో ఉద్రిక్తత

**శంభు (హర్యానా-పంజాబ్,వెలుతురు జూలై 20:**

హర్యానా–పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిర్వహించనున్న మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా సహా పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు ఢిల్లీ వైపు తరలివస్తుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైతుల ర్యాలీని అడ్డుకునేందుకు శంభు సరిహద్దులో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ 'దేశ్ బచావో మోర్చా' దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే తక్కువ ధరలకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ తెరుచుకుంటుందని, దీని వల్ల దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్ నిర్వహించాలని నిర్ణయించాయి.ఈ మహాపంచాయత్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పిలుపు మేరకు పంజాబ్ నుంచి రైతులు పెద్ద ఎత్తున ఢిల్లీకి బయలుదేరడంతో శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత నెలకొంది.రైతులు ఢిల్లీకి చేరకుండా హర్యానా పోలీసులు శంభు సరిహద్దును పూర్తిగా మూసివేశారు. భారీ కాంక్రీట్ బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేసి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ భద్రతను కట్టుదిట్టం చేశారు.ఈ సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బందాలా మాట్లాడుతూ, ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆరోపించారు. చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరించి అమెరికా కంపెనీలు, రైతులకు లాభం చేకూర్చేలా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంటోందని విమర్శించారు.పంజాబ్‌తో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల రైతులు మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. ఒకవేళ ఢిల్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే శంభు సరిహద్దు వద్దే శాంతియుతంగా సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఇది కేవలం ఆందోళనకు ఆరంభం మాత్రమేనని, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోయినా, రైతుల డిమాండ్లను పరిష్కరించకపోయినా ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని జర్మన్‌జిత్ సింగ్ బందాలా హెచ్చరించారు.

## జేఎన్టీయూ రిజిస్టర్ కలిసిన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 21:**

హైదరాబాదులోని జవహర్లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ రిజిస్ట్రర్ డాక్టర్ ఏ. జయలక్ష్మి ని కలిసి విశ్వవిద్యాలయంలలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అదేవిధంగా దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలని అదేవిధంగా 2016 చట్టం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని దివ్యాంగులకు ఫీజులలో రాయితీలు కల్పించాలని, డిజేబుల్ సెల్ ఏర్పాటు చేయాలని, దివ్యాంగులకు అన్ని విభాగాలలో ప్రాధాన్యత కల్పించాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. అశోక్ కోరారు. ఇటీవల విడుదల చేసిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియామకంలో దివ్యాంగులకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల చట్టం2016 ప్రకారం ఉద్యోగాలలో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిజిస్టర్ దృష్టికి



తీసుకెళ్లడం జరిగింది. రిజిస్టర్ స్పందిస్తూ కొన్ని రోజుల సమయంలో మీ సమస్యలు పరిష్కారం చేస్తామని ఇట్టి విషయం వైస్ ఛాన్సలర్. దృష్టికి తీసుకుపోయి దివ్యాంగులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల పురం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ విశ్వవిద్యాలయాల దివ్యాంగుల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దొరపల్లి దానమ్మ. విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర సభ్యులు ఆంజనే యులు కురుమ తదితరులు పాల్గొన్నారు.

# సోనమ్ వాంగ్‌చుక్‌కు హైకోర్టులో ఊరట

- **నిరంతర పర్యవేక్షణ అవసరమన్న నిపుణులు**

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**

వివిధ పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు ఢిల్లీ హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను గురుగ్రామ్‌లోని మెదాంతా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు న్యాయస్థానం మంగళవారం అనుమతి ఇచ్చింది. వాంగ్‌చుక్‌ను ఆయనకు నచ్చిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు నిరాకరిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం ఆయనను తక్షణమే మెదాంతా ఆస్పత్రికి తరలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.విచారణ సందర్భంగా సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్న ఎయిమ్స్ వైద్య బృందంతో పాటు, ఆయన వ్యక్తిగత వైద్యుడితో కూడా హైకోర్టు ధర్మాసనం వివరంగా మాట్లాడింది. వాంగ్‌చుక్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణ అత్యంత అవసరమనే విషయంలో అందరి వైద్యుల అభిప్రాయం ఒక్కటిగానే ఉందని కోర్టు పేర్కొంది. ఈ వైద్య నివేదికలను పరిశీలించిన అనంతరం, ప్రభుత్వ ఆస్పత్రిలో తన ఆరోగ్య పరిస్థితి మరియు వసతులపై వాంగ్‌చుక్ వ్యక్తం చేసిన సందేహాలను, ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతూ ధర్మాసనం మధ్యాహ్నం ఈ కీలక ఉత్తర్వులు ఇచ్చింది.వాంగ్‌చుక్ తరపున కోర్టులో హాజరైన సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ..

ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని వెల్లడించారు. నిరాహార దీక్షను కొనసాగిస్తున్నప్పటికీ ఆయన నోటి ద్వారా ద్రవపదార్థాలను (ఫ్రూట్ జ్యూస్‌లు, నీళ్లు) తీసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఆస్పత్రిలో ఆయనపై నిరంతరం పోలీసు నిఘా ఉంచుతున్నారని, కనీసం మొబైల్ ఫోన్ ఉపయోగించేందుకు కూడా అనుమతి ఇవ్వడం లేదని వాంగ్‌చుక్ రాసిన లేఖను కోర్టు ముందుంచారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, మెదాంతా ఆస్పత్రికి తరలిస్తే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయా అని ప్రశ్నించగా, ఖచ్చితంగా పరిష్కారమవుతాయని అఖిల్ సిబల్ స్పష్టం చేశారు.ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వ్యాఖ్యలు చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ నుంచి గురుగ్రామ్‌లోని మెదాంతా ఆస్పత్రికి తరలించడంపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని ధర్మాసనానికి తెలిపారు. మెదాంతా అనేది అత్యంత పేరొందిన, అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్న ఆస్పత్రి అని, అక్కడ ఆయన చికిత్స పొందేందుకు ప్రభుత్వం ఎంతమాత్రం అడ్డుచెప్పదని వివరించారు. కేంద్రం ధోరణి సానుకూలంగా ఉండటంతో హైకోర్టు ఈ నిర్ణయాన్ని తీసుకుంది.అదే సమయంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు ముందు ఒక ముందస్తు షరతును ఉంచారు. మెదాంతాలో చేరుస్తున్నందున, అక్కడ చికిత్స అందిస్తున్న వైద్యుల సలహాకు విరుద్ధంగా ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కోరకూడదని స్పష్టం చేశారు. దీనికి హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. వాంగ్‌చుక్‌ను తక్షణమే మెదాంతా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించింది. అలాగే ఇప్పటివరకు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో ఆయనకు నిర్వహించిన అన్ని వైద్య పరీక్షల నివేదికలు, ఆరోగ్య రికార్డులను మెదాంతా ఆస్పత్రి వైద్య బృందానికి తక్షణమే అందజేయాలని ఆదేశించింది.ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో పూర్తిస్థాయిలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్‌కు అందించిన చికిత్స కంటే ఆయనను ఒక రకమైన నిర్బంధంలో ఉంచినట్లే అనిపించిందని సంచలన ఆరోపణలు చేశారు. నిజానికి ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమీ ప్రాణాపాయ స్థితిలో లేదని, జంతర్‌మంతర్ నిరసన శిబిరం వద్దే వైద్యులు ఆయనను పర్యవేక్షించే అవకాశం ఉన్నప్పటికీ బలవంతంగా ఆస్పత్రికి తరలించారని విమర్శించారు. ఏదేమైనా కోర్టు ఉత్తర్వుల ప్రతి కాపీ అందగానే ఆయనను మెదాంతాకు మారుస్తామని చెప్పారు.మరోవైపు పరీక్షల అక్రమాలపై సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'సంసద్ చలో' ముట్టడి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ క్రమంలో చోటుచేసుకున్న హింస, విధ్వంస ఘటనలపై ఢిల్లీ పోలీసులు తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ ఘర్షణలకు సంబంధించి నాలుగు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, లభించిన ఆధారాలను బట్టి మరిన్ని కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధ్వంసం వెనుక ఒక పక్కా వ్యూహం, ప్రణాళిక ఉన్నట్లు కీలక ఆధారాలు లభించాయని ఢిల్లీ పోలీసు అధికారులు వెల్లడించారు.సోమవారం నాటి ముట్టడి సమయంలో చోటుచేసుకున్న రాళ్లదాడి మరియు ఘర్షణల్లో సుమారు 118 మందికి పైగా పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని, 20కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. పార్లమెంట్ స్ట్రీట్, కన్నాట్ ప్లేస్ స్టేషన్లలో భారతీయ న్యాయ సంహిత, ఆయుధ చట్టం, ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, డ్రోన్ విజువల్స్ ఆధారంగా రాళ్ల దాడికి పాల్పడిన అల్లరి మూకలను గుర్తిస్తున్నారు. అనుమతి లేకుండా డ్రోన్లు ఎగరవేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటుండగా, జంతర్మంతర్ వద్ద తమ నిరసన శాంతియుతంగా కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.

# అమెరికాలో టీటీఏ మెగా కన్వెన్షన్‌కు హాజరైన సీతక్క

**వాషింగ్టన్ డీసీ, జూలై 22:**

- **కన్వీనర్ ప్రవీణ్ చింత కృషిని అభినందించిన మంత్రి**
- **ఐక్యత, సేవాభావంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**

అమెరికాలో నిర్వహించిన తెలంగాణ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) మెగా కన్వెన్షన్‌లో పాల్గొనడం ఎంతో ఆత్మీయ అనుభూతిని కలిగించిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.ఈ సందర్భంగా టీటీఏ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాలిపెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు చూపిన ఆప్యాయత, ఆతిథ్యానికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రవాస తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ స్వదేశంతో అనుబంధాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు.మెగా కన్వెన్షన్ విజయవంతం కావడంలో కన్వీనర్ ప్రవీణ్ చింత చేసిన కృషి ప్రశంసనీయమని సీతక్క అన్నారు.

కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయనతో పాటు నిర్వాహక బృందం ఎంతో శ్రమించిందని కొనియాడారు.టీటీఏ కార్యవర్గ సభ్యులందరికీ అభినందనలు తెలియజేసిన మంత్రి, సంస్థ ఇదే ఐక్యత, సేవాభావంతో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రవాస తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరింత విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# భీమ్ ఆర్మీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 21:**



నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని హోటల్ అక్షయ పార్క్‌లో భీమ్ ఆర్మీ భారత్ ఏక్తా మిషన్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు వనం మహేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని నాయకులు, కార్యకర్తలు, సహచరులందరికీ 11వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గత 11 సంవత్సరాల ప్రయాణం ఒక సంస్థ చరిత్ర మాత్రమే కాకుండా, లక్షలాది మంది బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి, త్యాగాలకు, అంకితభావానికి సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొంటూ సమాజ హక్కుల సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు.భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. బహుజన సమాజ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువచ్చిన ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక వందనాలు తెలియజేస్తూ, వారి త్యాగం, ధైర్యం, నిస్వార్థ సేవలే భీమ్ ఆర్మీకి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, బహుజన రాజ్య సాధన కోసం మరింత ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి జంగీర్ ఖాన్, సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ రావణ్, టీడీపీ భువనగిరి పార్లమెంట్ కార్యదర్శి లింగాల యాదయ్య, భీమ్ ఆర్మీ మండల అధ్యక్షుడు ఎస్‌కే నిరంజన్, సీపీఎం మండల నాయకులు కొప్పు శ్రావణ్ కుమార్, అలాగే కొత్తూరు నవీన్, బోడ రాకేష్, ఎస్‌కే ఫాయాజ్, ఎస్‌కే నజీర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చెయ్యాలి

- **విద్యార్థులు యువతపై లాటిచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాం**
- **గుండు వెంకటనర్సు**
- **సిపిఎం పార్టీ మండల కార్యదర్శి**

**మోత్కూర్, జులై 21,వెలుతురు న్యూస్ :**




కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చెయ్యాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులు,యువతపై నిన్న జరిగిన లాటిచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మంగళవారం రోజున మోత్కూర్ లో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల్లో అవినీతి, ప్రశ్నపత్రాల్లో లీకేజీలు నియమాకాల్లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు . జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న నిరసన కారులను అడ్డుకొని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడిచేయడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థులు నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థులందరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య తదితరులు ఉన్నారు.

# బెంగళూరు క్వారీ: లాభాల వేటలో శ్రామికుల బలి

పాపని నాగరాజు (సత్యశోధక మహాసభ)

బెంగళూరు శివార్లలోని తవరేకెర–మాదపట్టణ పరిధిలోని ఒక రాతి క్వారీలో జరిగిన ఘోర దురంతం యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎగువ క్వారీలో యంత్రాలతో బండరాళ్లను తరలిస్తుండగా, ఒక భారీ బండరాయి దొర్లి దిగువ క్వారీలో పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఏడుగురు వలస కార్మికులు అక్కడికక్కడే నలిగి ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు, నలుగురు అదృష్టవశాత్తు తప్పించుకున్నారు. బతుకు దెరువు కోసం బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించిన నిరుపేదలు, ఉపాధి కోసం వచ్చిన నేలపైనే శవాలుగా మిగిలిపోయారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రమాదం కాదు. లాభాలను మానవ ప్రాణాల కంటే గొప్పగా భావించే ఆర్థిక విధానం, చట్టాలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వ యంత్రాంగం, శ్రామికుల పట్ల కొనసాగుతున్న సామాజిక ఉదాసీనత కలిసి సృష్టించిన వ్యవస్థాగత విషాదం.ఈ దురంతాన్ని పరిశీలిస్తే ఐదు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. అవి: మొదటిది, లాభమే ఉత్పత్తి ప్రక్రియకు ప్రధాన లక్ష్యంగా మారినప్పుడు శ్రామికుడి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం అన్నీ రెండో స్థానానికి వెళ్లిపోతాయి. భద్రతా ప్రమాణాలను పాటించడం ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుందనే కారణంతో అనేక యాజమాన్యాలు వాటిని నిర్లక్ష్యం చేస్తుంటాయి. బెంగళూరు క్వారీ దురంతం కూడా అదే వాస్తవాన్ని బహిర్గతం చేసింది. కార్మికులకు హెల్మెట్లు, రక్షణ తాళ్లు, ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు వంటి కనీస భద్రతా సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దీనికి నిదర్శనం.ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కోట్ల రూపాయలు వెచ్చించే యాజమాన్యాలు, శ్రామికుల ప్రాణాలను కాపాడే కనీస ఏర్పాట్లను మాత్రం అదనపు ఖర్చుగా చూస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలను నివారించే చర్యల కంటే, ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం పాలకులకూ, యాజమాన్యాలకూ అలవాటుగా మారింది. ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసిన విషయం ఏమిటంటే, లాభాలనే కేంద్రంగా చేసుకున్న ఆర్థిక వ్యవస్థలో శ్రామికుడి ప్రాణం కంటే మూలధన విస్తరణకే అధిక ప్రాధాన్యం లభిస్తోంది.రెండవది, రక్షణ సిబ్బంది వెల్లడించిన వివరాలు అక్కడి పని పరిస్థితుల క్రూరత్వాన్ని బయటపెట్టాయి. ఎగువ క్వారీలో యంత్రాలతో బండరాళ్లు తరలిస్తుండగా, దిగువన పనిచేస్తున్న కార్మికులను ముందుగా హెచ్చరించే కనీస సమాచార వ్యవస్థ కూడా అక్కడ లేదు. ఒకే సర్వే నంబరులో ఐదేళ్లుగా పక్కపక్కనే నడుస్తున్న రెండు క్వారీల యజమానుల మధ్య కనీస సమన్వయం లేకపోవడం వల్లనే ఎగువ నుంచి దొర్లిన బండరాయి దిగువన పనిచేస్తున్న వారిపై పడింది. ఉత్పత్తి ఆగకూడదనే ఉద్దేశంతో, ఇలాంటి కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా పనులు కొనసాగించారు.ఇది ఒక్క యాజమాన్యం నిర్లక్ష్యానికి మాత్రమే పరిమితమైన విషయం కాదు. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల వాస్తవ జీవన పరిస్థితులకు ఇది ప్రతిబింబం. వీరిలో చాలామందికి నియామక పత్రాలు ఉండవు. ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, సామాజిక రక్షణ, ఉద్యోగ హామీ వంటి హక్కులు అందుబాటులో ఉండవు. నివాసానికి తగిన వసతి లేక, దుమ్ము, శబ్ద కాలుష్యం మధ్య తాత్కాలిక షెడ్లలోనే జీవించాల్సి వస్తోంది. ఉత్పత్తి ప్రక్రియలో అత్యంత ప్రమాదకరమైన పనులను వీరితో చేయించుకుంటూనే, వారి జీవన ప్రమాణాలపై యాజమాన్యాలు ఎలాంటి బాధ్యత తీసుకోవడం లేదు.ఈ పరిస్థితుల్లో శ్రామికుడి ఆరోగ్యం, శారీరక సామర్థ్యం, పని చేసే కాలం అన్నీ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే లెక్కల్లో భాగంగా మారిపోతాయి. ఒక కార్మికుడు గాయపడినా, మరణించినా, అతని స్థానంలో మరో నిరుపేదను తీసుకురావచ్చనే అమానవీయ దృక్పథం దోపిడీని మరింత క్రూరంగా మారుస్తోంది. అందువల్ల ఆధునిక పరిశ్రమల్లో బానిసత్వం పాత రూపంలో కనిపించకపోయినా, ఆర్థిక బలహీనత, ఉద్యోగ అస్థిరత, ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడం ద్వారా శ్రామికుడిని ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడానికి బలవంతం చేసే కొత్త రూపాన్ని సంతరించుకుంది.ఈ బానిసత్వానికి భారత దేశంలో ఒక చారిత్రక మూలం కూడా ఉంది. ఇక్కడ శూద్ర వర్ణంలో, భూస్వామ్యం చేతిలో ఉన్న కొద్దిమంది అగ్రకుల భూస్వాములను మినహాయిస్తే, మిగిలిన అతిశూద్ర కులాల శ్రమకు చరిత్రలో ఎన్నడూ సరైన విలువ దక్కలేదు. దీన్నే వెట్టి శ్రమ అని పిలిచేవారు. ఆనాటి వెట్టి విధానంలో ఎలాగైతే శూద్రుల శ్రమకు వెలకట్టకుండా వాడుకున్నారో, నేటి పారిశ్రామిక, క్వారీ యాజమాన్యాలు కూడా అదే చారిత్రక ధోరణిని కొత్త రూపంలో అమలు చేస్తున్నాయి. శూద్రుల శ్రమకు నిన్నటికీ నేటికీ విలువ లేకపోవడం యాదృచ్ఛికం కాదు, అది ఒక చారిత్రక కొనసాగింపు.మూడవది, ఏ పారిశ్రామిక ప్రమాదాన్నీ కేవలం యజమాని నిర్లక్ష్యంగా మాత్రమే చూడలేం. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వ శాఖలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించినప్పుడే ఇలాంటి దుర్ఘటనలను ముందుగానే నివారించవచ్చు. కానీ బెంగళూరు క్వారీ విషయంలో అలా జరగలేదు. గనులు–భూగర్భ శాఖ, కార్మిక శాఖ, స్థానిక పరిపాలనా యంత్రాంగం, మైనింగు, పర్యావరణ పరిరక్షణ బోర్డు, అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం తమ బాధ్యతలను నిర్వర్తించి ఉంటే ఈ ప్రమాదం ఇంత ఘోర రూపం దాల్చేది కాదు.స్థానిక ప్రజలు బఫర్ జోన్‌లోనే అనుమతుల్లేకుండా క్వారీయింగ్ కొనసాగుతోందని పలుమార్లు ఫిర్యాదులు చేశారు. యశ్వంత్‌పూర్ ఎమ్మెల్యే సోమశేఖర్ కూడా ఈ అక్రమాలను శాసనసభలో, పిటిషన్ల కమిటీ ముందు ప్రస్తావించారు, ఈ దురంతం కేవలం నిర్లక్ష్యం కాదని, భూగర్భ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు అక్రమ క్వారీ నిర్వహణకు కొమ్ముకాశారని ఆరోపించారు. అయినప్పటికీ తనిఖీలు, నియంత్రణ చర్యలు, లైసెన్సు నిబంధనల అమలులో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ప్రమాదం జరగకముందే అందిన హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం వల్లనే ఏడుగురు శ్రామికులు ప్రాణాలు కోల్పోయారు.ఈ సంఘటన ఒక ముఖ్యమైన వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం చట్టాలను అమలు చేయడంలో విఫలమైతే, ఆ నిర్లక్ష్యం యజమానులకు పరోక్ష రక్షణగా మారుతుంది. తనిఖీలు సక్రమంగా జరగకపోవడం, ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోకపోవడం వల్ల భద్రతా ప్రమాణాలను విస్మరించే ధోరణి మరింత పెరుగుతోంది. చివరికి మూల్యం చెల్లించేది మాత్రం శ్రామికులే. అందుకే ఇలాంటి దుర్ఘటనలను వ్యక్తిగత తప్పిదాలుగా కాకుండా, పాలనా వైఫల్యంగా కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ప్రమాదం జరిగిన వెంటనే తవరేకెర పోలీసులు క్వారీ యజమానులు డి. ఆనందస్వామి, ఎస్.ఆర్. ఉదయశంకర్‌తో పాటు మరో ముగ్గురిపై నేర పూరిత నిర్లక్ష్యం కింద కేసు నమోదు చేశారు. అయితే ఏడాదిలో సంగతి కాదు, ఏడు రోజులు గడిచినా ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలోనే ఉండటం, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా పోవడం, నిందితులను పట్టుకోవడంలో పోలీసు యంత్రాంగం ఎంత నిదానంగా వ్యవహరిస్తుందో చూపిస్తుంది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాలకు ప్రకటించిన పరిహారం, సహాయం పూర్తిగా అందించాలని ఎమ్మెల్యే సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యజమానులను కాపాడే ప్రయత్నం ఏమాత్రం జరగకూడదని ఆయన స్పష్టం చేశారు. డబ్బు, పలుకుబడి ఉన్నవారు ప్రాణనష్టం జరిగిన తర్వాత కూడా ఎంత సునాయాసంగా చట్టం నుంచి తప్పించుకోగలరో ఈ పరారీయే నిదర్శనం.యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలో కాలుష్యకారక పరిశ్రమలపై రైతులు ఏళ్ల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా, ప్రధాన మంత్రి కార్యాలయం, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, హైకోర్టు, పార్లమెంటు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోకపోవడం ఇదే ధోరణికి మరో నిదర్శనం. ఇలాంటి ప్రాణాంతక పరిశ్రమలను నియంత్రించాల్సిన శాఖలు యజమానుల పక్షాన నిలబడటం వెనుక, పెట్టుబడిదారీ వర్గాల మెప్పు పొందడం, పెట్టుబడులను ఆకర్షించడం అనే అభివృద్ధి లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది. యజమానుల పక్షాన ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయి, ప్రజల ప్రాణాలు తీసిన పరిశ్రమలను కట్టడి చేయడంలో మాత్రం ఏళ్ల తరబడి తాత్సారమే మిగులుతుంది.ఇక్కడ మరో ముఖ్యమైన వైరుధ్యాన్ని కూడా గమనించాలి. నేడు ప్రభుత్వం చాలా వ్యవహారాలను పేపర్‌లెస్, ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నామని చెబుతున్నా, కార్మికుల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు, చర్యల విషయంలో మాత్రం అధికార యంత్రాంగం ఆ విధానాన్ని అందిపుచ్చుకోవడం లేదు. ఏదైనా ఫిర్యాదుపై చర్య తీసుకోవాల్సిన ఆదేశం వచ్చినా, దాన్ని చేతిరాతతో లేదా పోస్టు ద్వారా చేరవేస్తున్నారు, దీనివల్ల తక్షణమే అమలులోకి రావాల్సిన ఆదేశం రోజుల తరబడి ఆలస్యంగా చేరుతుంది. ఈ ఆలస్యంలోనే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది, యాజమాన్యాలకు కోట్ల రూపాయల లాభం చేకూరుతుంది. అంటే, పరిపాలనా వేగం ఎక్కడ అవసరమో అక్కడ మందగించడం, ఎక్కడ మందగించాలో అక్కడ యజమానుల అనుకూలంగా వేగంగా కదలడం, ఇదే అసలు వైరుధ్యం.నాలుగవది, ఈ ప్రమాదంలో మరణించిన వారంతా బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, యాద్గిర్ నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు. ఇది యాదృచ్ఛికం కాదు. ప్రాంతాల మధ్య అభివృద్ధిలో ఉన్న అసమానతలు, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ నిరుద్యోగం, భూమిలేని కుటుంబాల పెరుగుదల లక్షలాది మందిని స్వస్థలాలు విడిచి వలస వెళ్లే పరిస్థితికి నెడుతున్నాయి. వేల కిలోమీటర్లు ప్రయాణించి ఉపాధి సంపాదించినా, భద్రత మాత్రం వారికి అందని హక్కుగానే మిగులుతోంది.వలస కార్మికులు అధికంగా అసంఘటిత రంగంలోనే పనిచేస్తారు. శాశ్వత ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, ప్రమాద బీమా, ఆరోగ్య సౌకర్యాలు, కార్మిక సంఘాల అండ వంటి హక్కులు వారికి చాలా సందర్భాల్లో అందుబాటులో ఉండవు. స్థానిక భాష తెలియకపోవడం, చట్టాలపై అవగాహన లేకపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటి పరిస్థితులను యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచుకుంటాయి. ఫలితంగా అత్యంత ప్రమాదకరమైన పనులను అత్యల్ప వేతనాలకు చేయించుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల నుంచి నిరంతరం వలస వచ్చే ఈ శ్రమశక్తి యజమానులకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం వల్ల, ఒక కార్మికుడి ప్రాణానికి విలువ తగ్గిపోతుంది. గాయపడిన లేదా మరణించిన వారి స్థానంలో మరొకరిని తీసుకొచ్చే అమానవీయ దృక్పథం బలపడుతోంది. ఇదే కారణంగా అనేక పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల కంటే ఉత్పత్తి నిరంతరతకే ప్రాధాన్యం ఇస్తున్నారు.మన దేశ సమాజంలో ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా చూడాల్సిన అవసరం ఉంది. అసంఘటిత రంగంలోని అత్యంత ప్రమాదకరమైన శారీరక శ్రమలో పనిచేసేవారిలో అధికశాతం మంది దళిత, బహుజన, ఆదివాసీ వర్గాలకు చెందినవారే. ఇది యాదృచ్ఛికం కాదు. చారిత్రకంగా ఆర్థిక ఆధిపత్యం, సామాజిక ఆధిపత్యం పరస్పరం బలపరుచుకుంటూ వచ్చాయి. అందువల్ల ప్రమాదకర శ్రమలో అధికంగా దళిత, బహుజన, ఆదివాసీలు ఉండగా, మూలధన యాజమాన్యంలో అగ్రవర్ణాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఈ కారణంగా వర్గ దోపిడీ, కుల ఆధారిత శ్రమ విభజన ఒకదానికొకటి బలాన్నిస్తూ అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.ఐదవది, ప్రతి పారిశ్రామిక ప్రమాదం తర్వాత ప్రభుత్వాలు దాదాపు ఒకే విధమైన చర్యలను పునరావృతం చేస్తుంటాయి. విచారణ కమిటీలు వేయడం, కొద్ది రోజులపాటు పరిశ్రమలను మూసివేయడం, కొందరు అధికారులను బదిలీ చేయడం, నోటీసులు జారీ చేయడం, మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించడం, ఇవన్నీ ప్రమాదం జరిగిన వెంటనే కనిపించే చర్యలు. కొద్ది రోజులపాటు ఇవి వార్తల్లో నిలుస్తాయి. ప్రజల్లో చెలరేగిన ఆగ్రహం చల్లారిన తర్వాత మాత్రం పరిస్థితి మళ్లీ యథాతథంగా మారిపోతుంది.దీనికి కారణం ప్రమాదాన్ని ఒక వ్యక్తి తప్పిదంగా చూడడమే తప్ప, లాభాల కోసం భద్రతను త్యాగం చేసే ఉత్పత్తి విధానంలో అంతర్లీనంగా ఉన్న వైరుధ్యంగా చూడకపోవడమే. భద్రతా ప్రమాణాలను అమలు చేయడం కంటే, ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం చెల్లించడం చౌకగా ఉంటుందని భావించే దృక్పథం యాజమాన్యాల్లో బలపడుతోంది.బెంగళూరు క్వారీ దురంతం ఇది కర్ణాటకకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని చూపిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా దేశవ్యాప్తంగా ఇదే నిర్లక్ష్యం అనేక రూపాల్లో కనిపిస్తోంది. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఒక రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి కేంద్రంలో జూన్ 2026లో అమ్మోనియా వాయువు లీకై, మొదట ఏడుగురు మరణించారని వార్తలు వచ్చినా, రోజులు గడిచేకొద్దీ మృతుల సంఖ్య పదిహేడుకు చేరింది, ఎనభై మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే, వీరంతా ఒడిశా, అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారు. అత్యవసర సమయాల్లో స్పందించే ముందస్తు రక్షణ ఏర్పాట్లు లేకపోవడం, లాభాల కోసమే తప్ప శ్రామికుల ప్రాణాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లనే ఈ ఘోరం జరిగింది. దీనికి తోడు, మధ్యవర్తులుగా వ్యవహరించే దళారీ కాంట్రాక్టర్లు కార్మికులను కేవలం ఒక చౌక శ్రమశక్తిగా చూస్తూ, వారి అధికారిక రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, వలస కూలీలకు తమ హక్కులపై కనీస అవగాహన కల్పించకపోవడం వల్ల ఈ వ్యవస్థాగత దోపిడీ నిరంతరాయంగా సాగుతోంది. ప్రభుత్వ కార్మిక శాఖల తనిఖీలలో ఉదాసీనత, అంతరాష్ట్ర సమన్వయ లోపం, కాంట్రాక్టర్ల అక్రమ రిక్రూట్‌మెంట్ విధానాల వల్లనే ఇటువంటి ప్రమాదాలు పునరావృతమవుతూ వలస జీవుల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి.సంగారెడ్డి జిల్లాలోని సిగాచి రసాయన కర్మాగారంలో 2025 జూన్‌లో జరిగిన పేలుడులో యాభైకి పైగా కార్మికులు మరణించారు. మరణించిన ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించినా, ఏడాది గడిచినా సగటున కేవలం నలభై ఐదు లక్షలే చెల్లించారు, శాశ్వత వైకల్యం పొందిన వారికి పది లక్షలు, గాయపడిన వారికి ఐదు లక్షలు మాత్రమే నిర్ణయించారు. ఇది కేవలం జాప్యం కాదు, ప్రకటించిన మాటనే తుంగలో తొక్కి బాధిత కుటుంబాలను న్యాయస్థానాల చుట్టూ తిప్పే పాలనా నిర్లక్ష్యం.నల్లగొండ జిల్లాలో శ్రీశైలం అనుసంధాన కాలువ సొరంగం 2025 ఫిబ్రవరిలో కుప్పకూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏడాది గడిచినా వారిలో పలువురి మృతదేహాలు వెలికితీయలేకపోవడం ప్రణాళికా లోపాలను, భద్రతా వైఫల్యాలను బహిర్గతం చేసింది. ఈ ప్రమాదానికి ఏ ఒక్క ప్రభుత్వాన్ని మాత్రమే కారణంగా చూపి తప్పించుకోలేం. ఏళ్ల తరబడి ఈ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించకుండా, యంత్రాలను నిర్వహణ లేకుండా వదిలేసి పనులను స్తంభింపజేసిన నిర్లక్ష్యం ఒక వైపు ఉంటే, తర్వాత పనులు తిరిగి మొదలుపెట్టేటప్పుడు తగిన భూగర్భ అధ్యయనాలు, భద్రతా ముందు జాగ్రత్తలు తీసుకోకుండా హడావుడిగా ముందుకు పోవడం మరో వైపు కారణమైంది. అంటే అధికారంలో ఏ ప్రభుత్వం వచ్చినా, ప్రజల ప్రాణాల కంటే ప్రాజెక్టు రాజకీయ ప్రయోజనమే ముఖ్యమైందన్నది స్పష్టం. సొరంగంలో పనిచేస్తున్న కార్మికుల్లో అత్యధికులు బీహార్ వంటి తెలంగాణేతర రాష్ట్రాల నుంచి వచ్చినవారే, వీరికి కాంట్రాక్టు కంపెనీ రోజుకు కేవలం ఐదారు వందల రూపాయల కూలీ ఇస్తూ, అది కూడా నెలల తరబడి బకాయి పెట్టిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఒక కుటుంబం తన పెద్దదిక్కును కోల్పోయిన కడుపుకోతకు చివరికి ఎవరు జవాబుదారీ వహిస్తారు, లాభాలు జేబులో వేసుకున్న కాంట్రాక్టు సంస్థా, లేక ప్రాజెక్టును సరిగ్గా నిర్వహించని, కార్మికుల భద్రతను పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగమా అన్నది ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలింది.విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై జాతీయ మానవ హక్కుల సంఘం స్వయంగా జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరాల్సి రావడం కూడా పని ప్రదేశాల భద్రత ఎంత నిర్లక్ష్యానికి గురవుతోందో తెలియజేస్తోంది. ఇవి వేర్వేరు రాష్ట్రాల్లో జరిగిన విడివిడిగా ఉన్న సంఘటనలు కావు. భద్రత కంటే ఉత్పత్తికి, ఉత్పత్తి కంటే లాభాలకు ప్రాధాన్యం ఇచ్చే ఒకే విధమైన అభివృద్ధి నమూనా ఫలితాలు. అందుకే ప్రదేశాలు మారుతున్నాయి, ప్రమాదాల స్వరూపం మారుతోంది, కానీ బలవుతున్నవారు మాత్రం శ్రామికులే.మన దేశంలో కార్మిక ఉద్యమం వెల్లడిస్తున్న గణాంకాల ప్రకారం, పని ప్రదేశాల్లో జరిగే ప్రమాదాల్లో గణనీయమైన వాటా అధికారిక రికార్డుల్లోనే నమోదుకావడం లేదు. వేలాది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా, అనేక సంఘటనలు గణాంకాల్లోకి కూడా రావడం లేదు. ప్రమాదాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, కార్మిక భద్రత కంటే ఉత్పత్తి నిరంతరతకే ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు ఈ విషాదాలను మరింత పెంచుతున్నాయి. ఇటీవలి చట్ట సవరణలపై కూడా కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి, యజమానుల బాధ్యతను తగ్గించే విధానాలు, కాంట్రాక్టు–ఔట్‌సోర్సింగ్ విధానాల విస్తరణ, శిక్షణ లేని కార్మికులను ప్రమాదకర విభాగాల్లో నియమించడం వంటి చర్యలు ప్రమాదాల అవకాశాలను మరింత పెంచుతున్నాయి. మరోవైపు, ప్రతి ప్రమాదం తర్వాత కార్మికుల నిర్లక్ష్యాన్నే కారణంగా చూపిస్తూ యాజమాన్యాలు బాధ్యత నుంచి తప్పించుకోవడం సాధారణమైపోయింది.అంతేకాదు, ప్రతి మరణానికి ప్రకటించే పరిహారం కూడా సమస్యకు పరిష్కారం కాదు. ఒక కుటుంబం తన ఆధారాన్ని కోల్పోయిన విషాదాన్ని డబ్బుతో భర్తీ చేయలేము. ప్రమాదం జరిగిన తర్వాత కొన్ని లక్షల రూపాయలు ప్రకటించడం కంటే, ప్రమాదం జరగకుండా నిరోధించే భద్రతా వ్యవస్థలను నిర్మించడం ప్రభుత్వాల, యాజమాన్యాల మొదటి బాధ్యత కావాలి. శ్రామికుడి ప్రాణానికి ధర కట్టే సంస్కృతి ఎంత త్వరగా ముగుస్తే, అంత త్వరగా ఇటువంటి దుర్ఘటనలు తగ్గుతాయి.అందువల్ల పరిష్కారం కేవలం పరిహారం, విచారణ కమిటీలు, నోటీసులతో ముగిసిపోకూడదు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి కార్మికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలి. పరారీలో ఉన్న నిందితులను వేగంగా పట్టుకునే బాధ్యతను పోలీసు యంత్రాంగం సీరియస్‌గా తీసుకోవాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను కూడా సమానంగా బాధ్యులుగా పరిగణించాలి. ప్రతి ప్రమాదకర పరిశ్రమలో కార్మికుల భాగస్వామ్యంతో స్వతంత్ర భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి. వలస కార్మికుల నమోదు, సామాజిక భద్రత, ప్రమాద బీమా, గౌరవప్రదమైన నివాస సౌకర్యం, ఆరోగ్య రక్షణ వంటి అంశాలను చట్టబద్ధమైన హక్కులుగా అమలు చేయాలి. భద్రతా తనిఖీలను పారదర్శకంగా నిర్వహించి వాటి నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.బెంగళూరు క్వారీ దురంతం మనకు మరోసారి ఒక చేదు సత్యాన్ని గుర్తు చేసింది. లాభమే ఉత్పత్తి లక్ష్యంగా, శ్రామికుడు కేవలం ఖర్చులోని ఒక అంకెగా మిగిలినంతకాలం ఇలాంటి దుర్ఘటనలు ఆగవు. శ్రామికుడి ప్రాణం, గౌరవం, భద్రత ఉత్పత్తి ప్రక్రియకు కేంద్రంగా నిలిచినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.



అందుకే ఈ విషాదాన్ని ఒక్క క్వారీ ప్రమాదంగా కాకుండా, శ్రమను చౌక వస్తువుగా చూసే అభివృద్ధి నమూనాపై తీవ్రమైన హెచ్చరికగా చూడాలి.నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలు, వారికి సహకరించే అధికార యంత్రాంగం, శ్రామికుల భద్రతను నిర్లక్ష్యం చేసే విధానాలు, ఇవన్నీ మారకపోతే బెంగళూరు దుర్ఘటన చివరిది కాదు. ప్రదేశాలు మారవచ్చు, పరిశ్రమలు మారవచ్చు, ప్రభుత్వాలు మారవచ్చు, కానీ బలయ్యేది మాత్రం అదే శ్రామిక వర్గం. అందుకే కార్మిక లోకం, ప్రజాస్వామ్య శక్తులు, సామాజిక ఉద్యమాలు రాష్ట్రాల సరిహద్దులను దాటి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. శ్రామికుడి ప్రాణం లాభాల కంటే గొప్పదనే విలువ సమాజంలో స్థిరపడినప్పుడే ఇలాంటి వ్యవస్థాగత విషాదాలకు శాశ్వత ముగింపు లభిస్తుంది.



పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ) 9948872190

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com